సత్యం, సమర్థత, విశ్వసనీయత

WWW.SAKSHYAM.COM

# సాక్ష్యం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సోమవారం 15 జూన్ 2026

సంపుటి: 17 | సంచిక: 168

పేజీలు: 08 | వెల: రూ.2:00

Published from Hyderabad, Vijayawada.


## ప్రపంచం కోసం భారత్ సరికొత్త ఆవిష్కరణలు

**ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను అందిస్తుంది**
**సాంకేతిక రంగంలో ప్రగతిపథంలో భారత్**
**'భారత్ ఇన్నోవేట్స్' సదస్సులో ప్రధాని మోదీ**
**ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో భేటీ**



భారత్ కేవలం తన సుస్థిర భవిష్యత్తు కోసమే కాకుండా ప్రపంచం కోసం సరికొత్త ఆవిష్కరణలు చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇతరులు కనుగొన్న పరిష్కారాలను వాడుకునే దేశంగా మాత్రమే భారత్ మిగిలి పోలేదని, ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను అందించే స్థాయికి ఎదిగిందని స్పష్టం చేశారు. ఫ్రాన్స్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక మిగతా 3 లో..



## తిరుగుబాటు వర్గానికి గుర్తింపు ఇవ్వవద్దు

**లోక్‌సభ స్పీకర్‌కు టీఎంసీ పార్టీ లేఖ**


తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్లమెంటరీ పార్టీ నేత అభిషేక్ బెనర్జీ ఆదివారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. తమ పార్టీ రెబల్ ఎంపీల గ్రూప్‌నకు ఎలాంటి గుర్తింపు, హోదా, సదుపాయాలు కల్పించవద్దని కోరారు. తిరుగుబాటు ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌తో సమావేశం కావడానికి ముందే ఆయన ఈ లేఖ రాయడం గమనార్హం. బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మమతా బెనర్జీ మిగతా 2 లో..



## మెట్రోకు కేంద్రం నిధులు ఇచ్చింది

**నగదు ఇవ్వకుంటే మేము రాజీనామాకు సిద్ధం**
**హామీలు అమలు చేయని మీరు రాజీనామా చేస్తారా?**
**నేను బీఆర్ఎస్ కార్యకర్తను కాదు.. బీజేపీ కార్యకర్తని**
**నను తరిమికొట్టే వ్యక్తి ఈ గడ్డ మీద ఇంకా పుట్టలేదు**
**సీఎం రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి మరోసారి ఆగ్రహం**

రేవంత్ రెడ్డిపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి మరోసారి మండిపడ్డారు. మిగతా 2 లో..



## ఒమన్ తీరంలో మరో నౌకకు ప్రమాదం

**షిప్‌లో 14 మంది భారతీయ సిబ్బంది**

గల్ఫ్ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న మరో నౌక ప్రమాదానికి గురైంది. భారత్ జెండాతో ప్రయాణిస్తున్న విరాట్ వన్ అనే నౌక ఒమన్ తీరానికి సమీపంలో ప్రమాదానికి గురైందని ఒమన్‌లోని భారత ఎంబసీ ఎక్స్‌లో పోస్టు చేసింది. నౌకలో 14 మంది భారతీయ మిగతా 2 లో..



మధ్య ఆసియాలో గత మూడు నెలలకు పైగా సాగుతున్న సుదీర్ఘ యుద్ధానికి తెరదించుతూ అమెరికా, ఇరాన్ దేశాలు ఒక చారిత్రాత్మక శాంతి ఒప్పందానికి వచ్చాయి. లెబనాన్‌తో సహా అన్ని రంగాలలో సైనిక చర్యలను "తక్షణమే, శాశ్వతంగా" నిలిపివేయడానికి ఇరుపక్షాలు అంగీకరించాయని ఈ చర్చల్లో మధ్యవర్తిత్వం వహించిన పాకిస్తాన్ ప్రకటించింది. ఈ ఒప్పందం ఖరారైనట్లు పాకిస్తాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా అధికారికంగా ప్రకటించారు.

# సంధి కుదిరింది

## అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం

- 19న శాంతి ఒప్పందంపై సంతకాలు
- స్విట్జర్లాండ్‌లో ఒప్పందంపై సంతకాలు
- హర్మూజ్ జలసంధిపై ఆంక్షల ఎత్తివేత
- మళ్లీ యథావిధిగా ఇంధన సరఫరా చాన్స్
- ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన

అమెరికా, ఇరాన్ మధ్య ఎట్టకేలకు శాంతి ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం (జూన్ 14) ఈ విషయాన్ని ప్రకటించారు. దీంతో పాటు హర్మూజ్ జలసంధి ఎలాంటి ఆంక్షలు లేకుండా తెరుచుకుంటుందని పేర్కొన్నారు. హర్మూజ్‌లో అమెరికా నేవీ దిగ్బంధాన్ని తక్షణమే తొలగించనున్నట్లు తెలిపారు. ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ 'ట్రూత్ సోషల్' లో ఇలా పోస్ట్ చేశారు. 'ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. ఈ ఒప్పందంలో భాగస్వాములైన అన్ని పక్షాలకు అభినందనలు' తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్న అంశాలివే.. 'ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదిరింది. ఇందులో పాల్గొన్న అందరికీ అభినందనలు. హర్మూజ్ జలసంధిని ఎటువంటి ట్యాక్స్ లేకుండా పూర్తిగా తెరవడానికి అనుమతి ఇస్తున్నాను. అలాగే అమెరికా నేవీ దిగ్బంధనాన్ని తక్షణమే తొలగించడానికి అనుమతి ఇస్తున్నాను. ప్రపంచంలోని అన్ని ఓడలు తమ ఇంజన్లను స్టార్ట్ చేయండి. చమురు సరఫరాను తిరిగి ప్రారంభించండి' అని ట్రంప్ రాసుకొచ్చారు. ఈ ఒప్పందంలో మధ్యవర్తిత్వం వహించిన పాకిస్తాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్, మిగతా 2 లో..

# హెచ్చరించినా పట్టించుకోరా?

## వర్షాలపై ఇటీవలే సమీక్ష నిర్వహించాం

- ఎటువంటి ముందస్తు చర్యలు తీసుకోలేదు
- అధికారులు సమన్వయంతో పని చేయలేదు
- ఉన్నతాధికారులందరూ రోడ్లపై ఉండాల్సిందే
- ట్రాఫిక్ జామ్ ఏర్పడితే కఠిన చర్యలు తప్పవు
- విద్యుత్ సమస్యలు ఉత్పన్నమైతే సహించను
- అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం

వర్షాలపై ఇటీవలే సమీక్ష నిర్వహించి హెచ్చరించినా అధికారులు ఎటువంటి ముందస్తు చర్యలు తీసుకోకపోవడంపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో వర్షం కురిసిన సమయంలో ట్రాఫిక్ ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు రోడ్లపై ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. అవసరమైతే తానే రోడ్లపైకి స్వయంగా వస్తానన్న సీఎం రేవంత్, వర్షంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టుల దగ్గర పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల మెయింటెనెన్స్ మాన్యువల్ ప్రకారం జరగాలని, ప్రాజెక్ట్‌ల సీఈలు, ఎస్ఈలు స్థానికంగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఇంజినీర్లు ప్రాజెక్టులు మిగతా 2 లో..



# సిఎం రేవంత్‌ది వెన్నుపోటు రాజకీయం

- మహిళలను కోటీశ్వరులను చేస్తానన్నారు
- కనీసం లక్షాధికారులనైనా చేయగలవా?
- ఒక్కో ఆడబిడ్డకు సర్కార్ రూ.లక్షన్నర బాకీ..
- బాకీ ఇస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటా
- అక్రమాలు బయటపెట్టిందనే మీనాక్షిపై పగ..
- బట్లర్ ఇంగ్లిష్ సీఎంకు హిట్లర్ ఆదర్శమా?
- 'సర్'పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




మహిళలను కోటీశ్వరులను చేస్తానన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కనీసం లక్షాధికారులనైనా చేయాలని, ఇచ్చిన హామీ ప్రకారం ఒక్కో ఆడబిడ్డకు బాకీ పడ్డ రూ.లక్షన్నర ఇస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ చేశారు. 'వృద్ధులు, ఒంటరి మిగతా 2 లో..



## నేటి నుంచి స్కూళ్లు ఆరంభం

**మారనున్న స్కూళ్ల యూనిఫాం**

వేసవి సెలవులు ముగియడంతో నేటి నుంచి విద్యార్థులు స్కూల్ బాట పట్టనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు బడులతోపాటు జూనియర్ కాలేజీల్లో 2026-27 కొత్త విద్యా సంవత్సరం ప్రారంభంకానుంది. నిజానికి ఈ నెల 12వ తేదీనే తెరుచుకోవాల్సి ఉన్నా.. చాలా జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా మిగతా 2 లో..

# సంపాదకీయం

## మమత భవిష్యత్ ప్రశ్నార్ధకమే!!

మామూలు వావాయి చెప్పులు...ముతక చీర..చంకలో సంచీ వేసుకుని సామాన్య స్త్రీలా కనిపించే ఆహార్యంతో ..పదిహేనేళ్లపాటు బెంగాల్‌ను ఏలిని మమతా బెనర్జీ, ఆ రాష్ట్రాన్ని ఎంతమేరకు భ్రష్టు పట్టించాలో అంతగా భ్రష్టు పట్టించారు. ఏం సాధించారంటే ఏమీ లేదు. అధికారం కోసం ఎంతకైనా తెగించడం అలవాటు చేసుకున్నారు. సంసారం పిల్లలు లేరు. అయినా మేనల్లుడిని పెట్టుకుని బెంగాల్‌లో రాజ్యమేలారు. నందిగ్రామ్‌తో రాష్ట్రంలోకి పరిశ్రమలు రాకుండా అడ్డుకుని, ప్రజల్లో మంచి ఇమేజ్ సాధించి..అదే ప్రజలను రాచిరంపాన పెట్టిన రాక్షసిగా పేరుగడించారు. పదిహేనేళ్లుగా అధికార మదంతో తనకు తిరుగులేదనిపించారు. అన్నింటికి మించి భారత భద్రతకు విఘాతం కలిగించారు. పొరుగునే ఉన్న బంగ్లాదేశీయులు యధేచ్ఛగా బెంగాల్లోకి గోడదూకారు. ఇక్కడే తిష్టవేశారు. వారిని ఓటు బ్యాంకుగా మలచుకున్న మమత బెనర్జీ దేశానికి సవాల్ విసిరిన అక్రమ వలసదారుల ఆగడాలను గుర్తించలేదు. తనకు తిరుగులేదని భావించి అనరాచక పాలనకు తెరతీసారు. రేప్‌లు, మర్డర్లు, దోపిడీలు, దొమ్మీలు జరుగుతున్నా.. పట్టించుకోలేదు. సామాన్యులు భయంభయంగా బతికారు. బిజెపి దెబ్బతో ఇప్పుడు దిమ్మతిరిగి నేలమీద పడ్డారు. తన ఉనికికే సవాల్‌గా మారింది. దీంతో కాంగ్రెస్‌తో కాళ్బేరానికి వచ్చారు. అందుకే మమతాబెనర్జీకి వరుస దెబ్బలు తగులుతున్నాయి. టీఎంసీ సీనియర్ నేత సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన 3 రోజులకే మరో ఎంపీ సుష్మితా దేవ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అనంతరం ఆమె అస్సాం సీఎం హిమంత శర్మతో సమావేశమయ్యారు. త్వరలో ఆమె బీజేపీలో చేరతారని సమాచారం. అస్సాంకు చెందిన సుష్మితా దేవ్ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి సంతోష్ మోహన్ దేవ్ కుమార్తె. గతంలో ఆమె అస్సాంలోని సిల్చార్ నుంచి గెలుపొందారు. ఇకపై అస్సాంలోనే రాజకీయాలు చేస్తానని, బెంగాల్‌లో కాదని ఆమె స్పష్టం చేశారు. తాజాగా ప్రకాశ్ చిక్ బరైక్ రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. దీంతో అక్కడ దాదాపు టిఎంసి ఖాళీ అవుతోంది. నిజానికి ప్రాంతీయ పార్టీలు ఇంతగా దెబ్బతిన్న దాఖాలు ఏ రాష్ట్రం లోనూ లేవు. మమత మీద విశ్వాసం లేదంటే ఆమె ఎంతగా నియంతలా వ్యవహరించారో తెలిసిపోతోంది. ఇప్పటికే అసెంబ్లీలో ఎమ్మెల్యేలు వేరుకుంపటి పెట్టుకున్నారు. టీఎంసీకి చెందిన 19 మంది ఎంపీలు తిరుగుబాటు చేసి వేరుకుంపటి పెట్టుకున్నారు. ఈ బృందానికి టీఎంసీ సీనియర్ ఎంపీ కాకోలీ ఘోష్ నేతృత్వం వహిస్తున్నారు. దీదీకి అత్యంత విధేయంగా ఉన్న శత్రుఘ్న సిన్హా, యూసుఫ్ పఠాన్, సయాని ఘోష్ కూడా తిరుగుబాటు బృందంతో చేతులు కలిపారు. జగదీశ్ చంద్ర మసునియా, ఖలి ఉర్ రహమాన్, అబు తాహిర్ ఖాన్, పార్థ భౌమిక్, బాపి హల్దార్, మాలా రాయ్, మితాలీ బాగ్, దీపక్ అధికారి, కాళీపాద సొరేన్, జూన్ మాలియా, అరూప్ చక్రవర్తి, షర్మిలా సర్కార్, అసిత్ కుమార్, శతాబ్ది రాయ్, రచనా బెనర్జీ కూడా తిరుగుబాటుదారుల బృందంలో ఉన్నారు. టీఎంసీకి లోక్‌సభలో 28 మంది సభ్యులుండగా 19 మంది రెబల్స్‌గా ప్రకటించుకున్నారు. మరోవైపు పశ్చిమబెంగాల్ శాసనసభకు ఇటీవల ఎన్నికైన 80 మంది టీఎంసీ ఎమ్మెల్యేల్లో 64 మంది తిరుగుబాటు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ ఎమ్మెల్యేలు, ఎంపీల్లో చీలికలు, నేతల రాజీనామాల నేపథ్యంలో ఆ పార్టీని జాతీయ కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయాలని కాంగ్రెస్ పార్టీ నేత సోనియాగాంధీ ప్రతిపాదించినట్టు సమాచారం. మమతను దారికి తెచ్చుకోవడానికి, బెంగాల్లో కాలు మోపడానికి కాంగ్రెస్‌కు ఇదొక్కటే అవకాశం. అయితే ఈ ప్రతిపాదనపై స్పందించేందుకు కొంత సమయం కావాలని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కోరినట్టు సమాచారం. ఇటీవల జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ అధికారం కోల్పోయి, బీజేపీ పాలన ప్రారంభమైన దరిమిలా.. టీఎంసీలో అంతర్గత కుమ్ములాటలు ప్రారంభమయ్యాయి. మరోవైపు బీజేపీ నుంచి ఒత్తిళ్లు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ ఒత్తిళ్ల నుంచి బయటపడేందుకు టీఎంసీని కాంగ్రెస్‌లో విలీనం చేయడమే పరిష్కారమని సోనియా సూచించినట్టు తెలిసింది. మరోవైపు, అభిషేక్ బెనర్జీ కాంగ్రెస్ నేత రాహుల్‌తో భేటీ అయ్యారు.టీఎంసీ అగ్రనేతలుగా ఉన్న వారు పార్టీపై తిరుగుబాటు జెండా ఎగరేయడంతో పాటు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతిస్తామని ప్రకటించారు. దీంతో పార్టీ భవితవ్యంపై మమత తల్లడిల్లుతున్నారు. భవిష్యత్తులో వచ్చే ఎన్నికల్లో ఏవిధంగా ముందుకు సాగాలన్నది మరింత ఇబ్బందికరంగా మారింది. 64 మంది ఎమ్మెల్యేలు.. రితబ్రత బెనర్జీ నేతృత్వంలో చీలిపోగా, 28 మంది ఎంపీల్లో 20 మంది కకోలీ ఘోష్ దస్తీదార్ నేతృత్వంలో విడిపోయి.. ఎన్డీయేకు మద్దతిస్తామని, తమను ప్రత్యేక సమూహంగా గుర్తించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖరాశారు. ఈ పరిణామాలతో టీఎంసీ పార్టీ మమత చేతుల్లోంచి జారిపోయే ప్రమాదం ఏర్పడింది. చీలిక వర్గాలకు 'గుర్తింపు' లభిస్తే.. పార్టీ గుర్తు, జెండా సహా టీఎంసీ ఆస్తులపైనా హక్కులు లభించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మమతా బెనర్జీ ఢిల్లీలో సోనియాగాంధీని కలుసుకుని సుదీర్ఘంగా చర్చలు జరిపారు. అనంతరం బుధవారం కూడా మరోసారి ఇరువురు భేటీ అయ్యారు. ఈ సందర్భంగానే సోనియాగాంధీ.. విలీన ప్రతిపాదనను మమత ముందు ఉంచారని టీఎంసీ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్‌లో విలీనం చేయడం ద్వారా బలమైన ప్రతిపక్షంగా బీజేపీని ఎదుర్కొనేందుకు అవకాశం ఉంటుందని ఆమె సూచించారని పేర్కొన్నాయి. టీఎంసీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తే, మమతా బెనర్జీకి కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షురాలి పదవితోపాటు ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి ప్రధాన కార్యదర్శి పదవులు ఇస్తామని సోనియాగాంధీ హామీ ఇచ్చినట్టు తెలిపాయి. ఈ ప్రతిపాదనపై తక్షణమే నిర్ణయం తీసుకోలేనని, కొన్ని రోజుల సమయం కావాలని మమత కోరినట్టు టీఎంసీ వర్గాలు వెల్లడించాయి. టీఎంసీ విలీన ప్రతిపాదన వార్తలపై బెంగాల్ కాంగ్రెస్ విభాగం సీనియర్ నాయకులు తీవ్రస్థాయిలో స్పందిస్తున్నారు. అక్రమార్కులు, అన్యాయాలు చేసిన పార్టీని కాంగ్రెస్‌లో ఎలా కలుపుకొంటారని నిలదీస్తున్నారు. అధికారికంగా దీనిపై ప్రకటన వచ్చాక తమ నిర్ణయం వెల్లడిస్తామని కొందరు నేతలు తెలిపారు. దీంతో కాంగ్రెస్‌కు కూడా చిక్కులు తప్పేలా లేవు. గతంలో కాంగ్రెస్ పార్టీతోనే రాజకీయాల్లోకి ప్రవేశించిన మమత.. 28 ఏళ్ల కిందట 1998లో కాంగ్రెసతో విభేదించి తృణమూల్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. వరుసగా మూడు సార్లు బెంగాల్ ఎన్నికల్లో విజయం దక్కించుకుని అధికారంలోకి వచ్చారు.అయితే ఆమె పార్టీని కూడా సరిగా నడపలేరని తాజా పరిణామాలు రుజువు చేస్తున్నాయి. ఎన్నో అక్రమాలు చేఇవుంటే తప్ప ఇప్పుడు బిజెపికి భయపడాల్సిన అవసరం లేదు. కానీ అరాచక పాలన సాగించిన పాపానికి ఆమెకు భవిష్యత్ ఉ ంటుందా అన్నది అనుమానమే.

## నేటి నుంచి స్కూళ్లు ఆరంభం

మొదటిపేజీ తరువాయి..

ఉండటంతో 15వ తేదీ నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. కొత్త విద్యా సంవత్సరంలో అమలు చేయనున్న పథకాలకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే సమీక్షించి, అధికారు లకు ప్రత్యేక ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బాగాంధీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాల్లోని విద్యార్థులకు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థుల తరహాలో మన్నికైన యూనిఫారాలను అందించేందుకు సర్కారు ఏర్పాట్లు చేసింది. నాణ్యమైన వస్త్రం అయితేనే యూనిఫారాలు ఎక్కువరోజులు మన్నికగా ఉంటాయని, వస్త్రం సేకరణ నుంచి కుట్టు పని వరకు ప్రతి దశలోనూ నాణ్యతకు పెద్దపీట వేయాలన్న సీఎం ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. అంతేకాదు తొలిసారిగా బ్రాండెడ్ బూట్లు, సాక్సులు, టై, బెల్టులను కూడా అందజేయనున్నారు. విద్యార్థులకు యూనిఫాం, ఇతర సామగ్రి అందజ్జసందుకు ప్రభుత్వం రూ.688 కోట్లు కేటాయించింది. మొత్తం 27 లక్షల మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫారాల కోసం 2.97 కోట్ల మీటర్ల వస్త్రాన్ని ప్రభుత్వం సేకరించింది. ఇందులో మఫత్‌లాల్ కంపెనీ 2.41 కోట్ల మీటర్లు, తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంస్థ 55.32 లక్షల మీటర్ల వస్త్రం సరఫరా చేస్తున్నాయి. కుట్టుపని బాధ్యతలను స్థానిక స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం అప్పగించింది. జూలై 1 నాటికి అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు యూనిఫాం అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ప్రభుత్వం ఈసారి విద్యార్థుల యూనిఫాం రంగులను స్వల్పంగా మార్చిం ది. బడుల్లోని విద్యార్థులకు లేత నీలం రంగు చొక్కా, ముదురునీలంరంగు ప్యాంటు/స్కర్టు.. గురుకులాల విద్యార్థులకు మెరూన్ గళ్ల చొక్కా, మెరూన్ ప్యాంటు/స్కర్టు ఉంటాయి. పైతరగతుల్లోని విద్యార్థినులకు ఇవే రంగుల్లోని స్కర్ట్, పంజాబీ డ్రెస్, చున్నీ సరఫరా చేయనున్నారు.

# సంధి కుదిరింది

మొదటిపేజీ తరువాయి..

శాంతి ఒప్పందం ఖరారైన సమాచారాన్ని ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ శాంతి ఒప్పందంలో లెబనాన్ కూడా భాగస్వామిగా ఉందని పేర్కొన్నారు. 'సుదీర్ఘ చర్చల తర్వాత అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరినందుకు ఛాలా సంతోషంగా ఉంది. లెబనాన్‌తో సహా అన్ని రంగాలలో సైనిక చర్యలను ముగించాలని ఇరు పక్షాలు అంగీకరించాయని' షరీఫ్ పేర్కొన్నారు. ఈ ఒప్పందంపై జూన్ 19న స్విట్జర్లాండ్‌లో ఇరాన్, అమెరికా ప్రతినిధులు సంతకాలు చేయనున్నారని తెలుస్తోంది. ట్రంప్, పాక్ ప్రధాని షరీఫ్ చేసిన శాంతి ఒప్పందం ప్రకటనపై ఇరాన్ స్పందించాల్సి ఉంది. తాము హడావుడిగా సంతకాలు చేయడం లేదని, తమకు ప్రయోజనం ఉ ంటేనే ఒప్పందంపై సంతకాలు చేస్తామని ఇదివరకే ఇరాన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. నిజంగానే ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిరిందా అనే అనుమానాలు ఉన్నాయి. పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ కూడా ఈ ఒప్పందాన్ని ధృవీకరిస్తూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇరు దేశాల మధ్య తీవ్రమైన, సుదీర్ఘమైన చర్చల తర్వాతే ఈ శాంతి ఒప్పందం సాధ్యపడిందని ఆయన వెల్లడించారు. ఈ ఒప్పందంలో భాగంగా అమెరికా, ఇరాన్ దేశాలు లెబనాన్‌తో సహా అన్ని ఫ్రంట్‌లలో తక్షణమే, శాశ్వతంగా సైనిక కార్యకలాపాలను, దాడులను నిలిపివేయడానికి అంగీకరించాయని ఆయన పేర్కొన్నారు."తీవ్రమైన చర్చల ఫలితంగా, అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిందని ప్రకటించడానికి మేము ఎంతో సంతోషిస్తున్నాము. ఈ సుదీర్ఘ ఘర్షణకు దౌత్యపరమైన, శాంతియుత పరిష్కారాన్ని కనుగొనడంలో అద్భుతమైన నిబద్ధతను ప్రదర్శించిన అమెరికా, ఇరాన్ నాయకత్వాలకు ధన్యవాదాలు. అలాగే ఈ క్లిష్టమైన మధ్యవర్తిత్వంలో మాకు సహకరించిన ఖతార్,సౌదీ అరేబియా, తుర్కియే దేశాల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు." అని షెహబాజ్ షరీఫ్ తెలిపారు.అటు ఇరాన్ కూడా అమెరికాతో శాంతి ఒప్పందం కుదిరిన విషయాన్ని ధ్రువీకరించింది. ఇరాన్ లీగల్ అండ్ ఇంటర్నేషనల్ అఫైర్స్ ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ ఘరీబాబాది ఈ విషయాన్ని వెల్లడించారు. అయితే తుది ఒప్పందానికి ముందు అమెరికా ఇచ్చిన హామీల అమలును పరిశీలించిన తర్వాతే 60 రోజుల చర్చల ప్రక్రియలోకి ప్రవేశిస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం అధికారికంగా అవగాహన ఒప్పందం (మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్)పై సంతకాలు జరగనున్నాయి. అనంతరం ఒప్పందానికి సంబంధించిన పూర్తి పాఠ్యాన్ని బహిరంగపరుస్తామని ఘరీబాబాది తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ నూతన ఒప్పందం పశ్చిమాసియాలో దీర్ఘకాలిక శాంతిని, ప్రాంతీయ భద్రతను నెలకొల్పేందుకు దోహదపడుతుంది. ఈ ఒప్పందంలో ప్రధానంగా ఇరాన్ అణు కార్యక్రమంపై కఠినమైన ఆంక్షలు విధించారు. ఈ ఒప్పందం ఇరాన్ భవిష్యత్తులో ఎలాంటి అణ్వాయుధాలను తయారు చేయకుండా ఈ ఒప్పందం పూర్తిగా అడ్డుకుంటుంది. ఇరాన్ అణు పరిశోధనా కేంద్రాలు, ప్లాంట్లపై అంతర్జాతీయ అణుశక్తి సంస్థ నిఘా బలోపేతం కానుంది. ఇరాన్ వద్ద ఉన్న ప్రమాదకరమైన అణు పదార్థాల తొలగింపు, ప్లాంట్ల నిరంతర తనిఖీలపై కఠినమైన నిబంధనలు అమల్లో ఉంటాయి.

# హెచ్చరించినా పట్టించుకోరా?

మొదటిపేజీ తరువాయి..

వదిలి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల కురిసిన వర్షానికి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ అస్తవ్యస్థానికి దారి తీయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులు ఎదురైతే తట్టుకునేందుకు సిద్ధంగా ఉండాలని ముందస్తుగానే సమీక్ష నిర్వహించి హెచ్చరించినా, శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించిందని మండిపడ్డారు. వర్షం కురిసిన రోజు ఎవరెవరు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించారు? ఎవరెవరు కార్యాలయాలకి



పరిమితమయ్యారో విచారణ చేసి నివేదిక సమర్పించాలని డీజీపీ సీవీ ఆనంద్, సీఎస్ రామకృష్ణారావులను సీఎం ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధతపై మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ నెల 9న వర్షం కురిసినప్పుడు అనేక చోట్ల ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందిపడ్డారని, పోలీస్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పని చేయలేదని సీఎం పేర్కొన్నారు. వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరికలు జారీ చేసినా ఆయా శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమవుతుందని ఊహించే ఈ నెల 1న నిర్వహించిన సమావేశంలో అప్రమత్తం చేశానని, అయినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆరోజు సీనియర్ అధికారులు సహా ఎవరెవరు రోడ్లపైకి వచ్చి సహాయక చర్యల్లో పాల్గొన్నారు? ఎవరెవరు రాలేదన్న దానిపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సూచించారు. మరోసారి ఇలాంటి పరిస్థితి తలెత్తితే కఠిన చర్యలు తీసుకోవాలని సీఎస్, డీజీపీని ఆదేశించారు. అలాంటి సమయాల్లో ప్రభుత్వ శాఖలన్నీ కలిసి పని చేయాలని మున్సిపల్, హైడ్రా, ట్రాఫిక్, జలమండలితో పాటు పోలీసులు క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనని, అవసరమైతే తానూ క్షేత్రస్థాయికి వస్తానని స్పష్టం చేశారు. వర్షం కురిసినప్పుడు నీరు నిలిచే ప్రాంతాలు, ట్రాఫిక్ స్తంభించే ప్రాంతాల డేటా ఆధారంగా పని చేయాలని విద్యుత్ శాఖ పూర్తిగా సన్నద్ధం కావాలని నిర్దేశించారు. ఇకపై వర్షం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తితే కఠిన చర్యలు తీసుకుంటామని, మానవ తప్పిదాలతో సమస్యలు ఉత్పన్నమైతే సహించనని హెచ్చరించారు. ట్రాఫిక్ విభాగంలో తక్షణమే ఖాళీలు భర్తీ చేయాలని సీఎం ఆదేశించారు. చెట్లు కూలడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంపైనా ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి సమయాల్లో విద్యుత్ పునరుద్ధరణ వెంటనే జరగాలని, అవసరమైతే మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.వర్షాకాలం దృష్ట్యా ప్రాజెక్టుల దగ్గర పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రాజెక్టుల నిర్వహణను సంబంధిత ఇంజినీర్లు కచ్చితంగా మాన్యువల్‌గా అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఉ న్నతాధికారుల అనుమతి లేకుండా ఇంజినీర్లు ప్రాజెక్టులు వదిలేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రాజెక్టుల నిర్వహణ, గేట్ల మరమ్మతులకు తక్షణమే నిధులు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.



# సీఎం రేవంత్‌ది వెన్నుపోటు రాజకీయం

మొదటిపేజీ తరువాయి..

మహిళలకు రూ.4వేల పింఛన్, అత్తకు 4వేలు, కోడలికి రూ.2,500 ఇస్తానని ధోఖా చేశారు. కోటి మంది ఆడబిడ్డలకు రెండున్నరేండ్ల కాలానికి బాకీ పడ్డ రూ.75వేలు, మిగిలిన రెండున్నరేండ్లలో రూ.75 వేలు మొత్తం రూ.1.50లక్షలు ఇవ్వు.. నిరుద్యోగ భృతి కింద 40లక్షల మంది యువతకు రూ.4వేల చొప్పున ఇవ్వు.. నువ్వు కోరుకున్నట్టు రాజీనామాకు రెడీగా ఉ న్నా' అని ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి మోచేతికి బెల్లంపెట్టి ఆరు గ్యారెంటీలంటూ అరచేతిలో వైకుంఠం చూపి గద్దెనెక్కిన తర్వాత ప్రజలను మోసం చేస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 30నెలల్లో హైదరాబాద్‌లో ఒక్క ఇటుక కూడా పేర్చలేదు, ఇల్లు కట్టలేదు, కానీ వేల ఇండ్లు హైడ్రా పేరిట నేలమట్టం చేశారని విరుచుకుపడ్డారు. అన్నం ఉడికిందా లేదో చెప్పేందుకు ఒక్క మెతుకు చూస్తే చాలు.. ఆ ఒక్క ఉదాహరణతో రేవంత్‌రెడ్డి ఎవరి మనిషో చెప్పొచ్చని దెప్పిపొడిచారు. ఓట్ల కోసం తనకు ఓటేసిన తెలంగాణ ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి.. చివరకు సొంత పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్‌కు కూడా వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి కేటీఆర్ హాజరై మాట్లాడారు. కేసీఆర్ మొదటిసారి గెలిచిన తర్వాత 24గంటల కరెంట్ ఇచ్చామని.. మళ్లీ గెలువగానే 24గంటలు నీళ్లిస్తాం అని ప్రకటించారు. 3.23 లక్షలున్న ఐటీ ఉద్యోగాలను 10లక్షలకు పెంచిన ఘనత బీఆర్‌ఎస్ సర్కార్‌కే దక్కిందని చెప్పారు. కానీ కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఐటీ రంగం ఆగమయ్యే పరిస్థితి ఉన్నదని పేర్కొన్నారు. 'రేవంత్ ఇచ్చిన హామీలను హైదరాబాద్‌వాళ్లు నమ్మలేదు. కానీ పల్లెటూరివాళ్లు ఆశలకు పోయి అరిగోసపడుతున్నారు' అని కేటీఆర్ పేర్కొన్నారు. 'ఖైరతాబాద్ వాళ్లు దానంకు ఓటేస్తే నాకేస్తడని తెలిసే కేసీఆర్‌ను చూసి ఓటేసి గెలిపించారు తప్పితే ఆయనకు ఓటేయలేదు.. అనుకున్నట్టే ఓట్లేసినోళ్లను మోసం చేసిండు..' అంటూ విమర్శలు గుప్పించారు. ఏదేమైనా ఖైరతాబాద్‌లో 2014, 2018లో గులాబీ పార్టీ గెలిచిందని, 2028లో మళ్లీ గులాబీ జెండా ఎగురడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఖైరతాబాద్ ఉపఎన్నిక వచ్చే అవకాశమున్నదని చెప్పారు. ద్రోహం చేసిన వారికి బుద్ధి చెప్పి అభివృద్ధి పనులు చేసిన బీఆర్‌ఎస్‌కు పట్టం కడుతారనే విశ్వాసమున్నదని స్పష్టంచేశారు.తనకు ఓటేసిన ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి.. చివరకు సొంత పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్ ఎంపీ పదవికి ఎసరుపెట్టారని కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'రేవంత్‌రెడ్డి తెలంగాణలో భూములు, కాంట్రాక్టుల పేరిట తెలంగాణను కొల్లగొడుతున్నడని అధిష్ఠానానికి చెప్పినందుకే ఆమెపై పగ సాధించిండు.. నిజాయితీ కలిగిన నేతగా, రాహుల్ దూతగా పేరున్న మీనాక్షిపై కేసు ఉ న్నదని బీజేపీకి ఉప్పందించిండు.. చివరకు వెన్నుపోటు పొడిచి కక్ష తీర్చుకున్నడు' అంటూ సంచలన ఆరోపణలు చేశారు.పాలకులెవరైనా గాంధీజీనో, అంబేద్కర్‌నో, ఇంతకుముందు సీఎంలుగా వ్యవహరించిన ఎన్టీఆర్‌నో, కేసీఆర్‌నో స్ఫూర్తిగా తీసుకుంటరు.. మన బట్లర్ ఇంగ్లిష్ సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుంటున్నరు.. ఆయన మాట్లాడిన మాటలు సిగ్గుచేటు' అని కేటీఆర్ దుయ్యబట్టారు. ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధంలో మాదిరిగా డిమాలిష్ చేస్తాననడం దుర్మార్గమని మండిపడ్డారు. పాలకులెవరైనా ఇది కడుతా.. అది కడుతా అంటరు.. రేవంత్ మాత్రం కూలగొడ్తా.. పడగొడ్తాననడం దురదృష్టకరమని నిప్పులుచెరిగారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సర్' ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. జూబ్లీహిల్స్ ఉ ప ఎన్నికలో మాదిరిగా మళ్లీ కాంగ్రెస్, బీజేపీ కుట్రలకు పాల్పడే అవకాశం ఉన్నదని చెప్పారు. ఏమాత్రం అలసత్వం చేసినా తెలంగాణలోనూ ఇలాంటి కుట్రలు జరిగే ప్రమాదమున్నదని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదును చురుగ్గా చేపట్టాలని కార్యకర్తలకు సూచించారు.



## ఒమన్ తీరంలో మరో నౌకకు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి..

సిబ్బంది ఉన్నట్లు తెలిపింది. ఒమన్ సాయంతో నౌకలోని సిబ్బందిని రక్షించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించింది. ఒమన్ తీరానికి దాదాపు 80 నాటికల్ మైళ్ల దూరంలో నౌక ప్రమాదానికి గురైనట్లు అమెరికా నౌకాదళానికి తొలుత సమాచారం అందినట్లు తెలిసింది.



వెంటనే అమెరికా నేవీకి చెందిన పీ-8 సముద్ర గస్తీ విమానం ఘటనా స్థలానికి చేరుకుని, మునిగిపోతున్న నౌక సమీపంలో ఒక లైఫ్ రాఫ్ట్‌ను జారవిడిచింది. నౌకలోని సిబ్బంది లైఫ్ రాఫ్ట్‌లోకి సురక్షితంగా చేరుకున్నట్లు సమాచారం. గత వారం ఒమన్ తీరంలో భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న నౌకలపై అమెరికా దాడులు చేసింది. ఈ దాడుల్లో ముగ్గురు భారతీయులు మృతిచెందారు. ఈ క్రమంలోనే మరో ప్రమాదం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు, ఈ ఘటనపై మస్కట్‌లోని భారత రాయబార కార్యాలయం ఎక్స్ వేదికగా స్పందించింది. విరాట్ 1 అనే వాణిజ్య నౌకలో ఇంజిన్ వైఫల్యం కారణంగా సమస్య తలెత్తిన్నట్లు పేర్కొంది. అందులోని భారతీయ సిబ్బందిని సురక్షితంగా లైఫ్ రాఫ్ట్‌లోకి మారినట్లు తెలిపింది. అందులో భారత్‌కు చెందిన 14 మంది సిబ్బంది ఉన్నారని వెల్లడించింది. ఒమన్ అధికారుల సమన్వయంతో, సమీపంలోని నౌకల ద్వారా సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొంది.ఇదిలా ఉండగా, ఒమన్ తీర ప్రాంతానికి సమీపంలో ఉన్న ఓ చమురు ట్యాంకర్‌లో విధులు నిర్వహిస్తున్న భారతీయ నావికుడు అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే, సకాలంలో వైద్య సాయం అందకపోవడమే వల్లే ఆయన మృతిచెందినట్లు ఫార్వర్డ్ సీమెన్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌యూఐ) ఆరోపించింది. మరోవైపు, ప్రస్తుతం పశ్చిమాసియాలో కొనసాగుతున్న ప్రాంతీయ ఉద్రిక్తతలు, క్షిపణి దాడుల భయంతో సహాయక చర్యల్లో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. మృతుడు తమిళనాడుకు చెందిన 35 ఏళ్ల నిశాంత్ ఉర్తనాథన్‌గా వర్గాలు పేర్కొన్నాయి. ఆయన ఎంటీ సెలెస్టియల్ అనే నౌకలో సెకండ్ ఆఫీసర్‌గా పని చేస్తున్నట్లు తెలిపాయి. జూన్ 8 నుంచి ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యాడని, అప్పటినుంచి వాంతులు చేసుకుంటూ ఆయన ఆరోగ్య పరిస్థితి పూర్తిగా క్షీణించిందని సహచర సిబ్బంది తెలిపారు. ఈ విషయాన్ని వెంటనే నౌక యాజమాన్యానికి తెలియజేసినట్లు వాళ్లు పేర్కొన్నారు.

## మెట్రోకు కేంద్రం నిధులు ఇచ్చింది

మొదటిపేజీ తరువాయి..

ఆదివారం హైదరాబాద్‌లోని అంబర్ పేటలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో రైలుకు కేంద్రం నిధులు ఇచ్చిందన్నారు. మెట్రోకు నగదు ఇవ్వకుంటే తాము రాజీనామా చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని మీరు రాజీనామా చేస్తారా? అంటూ సీఎం రేవంత్ రెడ్డిని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. తనను తరిమికొడతామని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని గుర్తు చేశారు. అయితే తాను బీఆర్‌ఎస్ కార్యకర్తను కాదని.. బీజేపీ కార్యకర్తనని తెలిపారు. తనను తరిమికొట్టే వ్యక్తి ఈ గడ్డ మీద ఇంకా పుట్టలేదని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ బిడ్డలను కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు పొడిచిందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఎవరు రాజీనామా చేస్తారో చెప్పాలంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిలను ఆయన డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఆట మొదలు పెట్టారని.. 2028లో ఈ ఆటను బీజేపీ ముగిస్తుందన్నారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కుండబద్దలు కొట్టారు.

## తిరుగుబాటు వర్గానికి గుర్తింపు ఇవ్వవద్దు

మొదటిపేజీ తరువాయి..

నేతృత్వంలోని టీఎంసీ పార్టీలో అంతర్గత పోరు మొదలైంది. మమతా బెనర్జీ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ 22 మంది రెబల్ ఎంపీలు ఒక గ్రూప్ లేదా వర్గంగా ఏర్పడ్డారు. తమను లోక్‌సభలో ప్రత్యేక పార్లమెంటరీ బ్లాక్ గా గుర్తించాలని కోరుతున్నారు. ఇందుకోసం వారు సోమవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలవనున్నారు. ఈ నేపథ్యంలోనే టీఎంసీ పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాశారు. ఆ లేఖలో ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (ఏఐటీసీ)ని లోక్‌సభలో ఒకే రాజకీయ పార్టీగా పరిగణించాలని కోరారు. తమ పార్టీ అధికారికంగా నియమించిన నేత, విప్ మాటకే ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ అసమ్మతి ఎంపీల నుంచి ఏవైనా విజ్ఞప్తులు వస్తే, వాటిపై ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు, టీఎంసీ అధికారిక వర్గానికి తమ వాదన వినిపించే అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. జూన్ 10న రాసిన ఈ లేఖను టీఎంసీ ఎంపీలు సాగరికా ఘోష్, కీర్తి ఆజాద్‌లు ఆదివారం స్పీకర్ ఓం బిర్లాకు అందజేశారు. ఈ సందర్భంగా సాగరికా ఘోష్ మాట్లాడుతూ, "టీఎంసీ ఒక విడదీయరాని పార్టీ. కనుక లోక్‌సభలో రెబల్స్ ప్రత్యేక వర్గాన్ని లేదా బ్లాక్‌ను ఏర్పాటు చేయలేరు. అది రాజ్యాంగ విరుద్ధం" అని అన్నారు. ఏదైనా విలీన ప్రతిపాదన చెల్లుబాటు కావాలంటే, రాజకీయ పార్టీ విలీనంతో పాటు, ఎంపీల్లో 2/3 వంతు సభ్యుల మద్దతు అవసరం అని అభిషేక్ బెనర్జీ చెప్పారు. చట్టం ప్రకారం, ఇందులో ఏదో ఒక షరతు మాత్రమే నెరవేరితే సరిపోదని ఆయన అన్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ (పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం) నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునే హక్కు టీఎంసీకి ఉందని ఆయన పేర్కొన్నారు. అయితే రెబల్ ఎంపీలు మాత్రం తమకు పూర్తి మెజారిటీ ఉందని వాదిస్తోంది.

## జూన్ 18 నుంచి 20 వరకు భారీ వర్షాలు

### రెండు రోజులు బలమైన ఈదురుగాలులు

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం మారుతోంది. మూడు రోజుల తరువాత రాష్ట్రంలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీల మధ్య రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. సోమవారం నుంచి మూడు, నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసేందుకు అనుకూల వాతావరణం ఉందని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు కాస్త నెమ్మదిగా కదులుతున్నాయి. ఇవి రాబోయే నాలుగైదు రోజుల్లో మరింత బలపడి, రాష్ట్రమంతటా పూర్తిగా విస్తరించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. రుతుపవనాల విస్తరణతో రాష్ట్రంలో వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ఎండల తీవ్రత నుంచి ప్రజలకు పూర్తిగా ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. నైరుతి రుతుపవనాల కదలికలతో సోమవారం, మంగళవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈదురుగాలులతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు పడే సమయాల్లో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద నిల్చోవద్దని అధికారులు హెచ్చరించారు.

## నేటి నుంచి జీ7 శిఖరాగ్ర సదస్సు

### ఫ్రాన్స్ వేదికగా సదస్సు ఆరంభం
### పాల్గొననున్న భారత ప్రధాని మోదీ

52వ జీ7 శిఖరాగ్ర సదస్సు నేటి నుంచి 17 వరకు ఫ్రాన్స్‌లోని ఎవియాన్-లెస్-బైన్స్ నగరంలో ఆరంభం కానుంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, కెనడా, జపాన్ దేశాల అధినేతలు గ్లోబల్ ట్రేడ్, ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ భద్రతపై కీలక చర్చలు జరపనున్నారు. ఈ ప్రతిష్టాత్మక సమావేశానికి భారతదేశంతో పాటు బ్రెజిల్, ఈజిప్ట్, సౌత్ కొరియా వంటి పలు అభివృద్ధి చెందుతున్న దేశాలను ఫ్రాన్స్ ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న తాజా భౌగోళిక రాజకీయ పరిస్థితులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గవర్నెన్స్ వంటి అంశాలు ఈసారి సదస్సులో ప్రధాన ఎజెండాగా మారనున్నాయి.

## నేటి నుంచే విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్

### జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం
### తొలి విడతలో 1,269 పాఠశాలల్లో అమలు
### 33 కళాశాలల్లోనూ అమలుకు ప్రణాళిక

తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకానికి నేటినుండి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలి విడత మొత్తం 1,302 విద్యా సంస్థల్లో ప్రారంభించనున్నారు. అందులో 1,269 స్కూల్స్, 33 కాలేజీలు ఉన్నాయి. వాటిల్లోని మొత్తం 1,44,610 మంది స్టూడెంట్స్‌కు వారంలో ఆదివారం మినహా మిగిలిన 6 రోజులు ఉదయం పూట అల్పాహారం అందిస్తారు. బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా విడతల వారీగా నూతన విద్యా సంవత్సరంలోనే తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అమలు చేస్తారు. మొత్తం 33 జిల్లాల్లో 39 చోట్ల కేంద్రీకృత కిచెన్ల




నిర్మాణానికి రూ.299.90 కోట్లు ఖర్చు అవుతుందని తెలంగాణ ప్రభుత్వం అంచనా వేసింది. అందులో ఇప్పటికే ఉన్న ఏడు కిచెన్లను ఉన్నతీకరిస్తారు. మిగిలినవి నూతనంగా నిర్మాణం చేపట్టనున్నారు. ఒక్కో కిచెన్‌కు రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 70 శాతం భరిస్తుంది. మిగిలిన 30 శాతం మొత్తాన్ని ఆయా స్వచ్ఛంద సంస్థలు ఖర్చు భరించనున్నాయి. కిచెన్ల నిర్మాణ బాధ్యతలను తెలంగాణ రాష్ట్ర విద్యా సంక్షేమ, మౌలిక అభివృద్ధి సంస్థ పర్యవేక్షిస్తుంది. ఇప్పటికే టెండర్లు కూడా ఖరారయ్యాయి. బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని హరే కృష్ణ మూమెంట్ ఛారిటబుల్ ట్రస్ట్, మన్నా ట్రస్ట్‌లు మొత్తం 8 జిల్లాల్లో అమలు చేయనున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాల్లోని 107 స్కూల్స్‌లో చదివే 26,294 మంది స్టూడెంట్స్‌కు ఈ పథకం అందుతుంది. ఈ 2 జిల్లాల్లో 12 కాలేజీల్లో 4,132 మందికి కూడా లభిస్తుంది. నారాయణపేట, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని 1,162 స్కూల్స్‌లో 1,03,891 మంది స్టూడెంట్స్ ప్రయోజనం పొందుతారు. నారాయణపేట, వికారాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 10,293 మందికి కూడా బ్రేక్‌ఫాస్ట్ అందుతుంది. ప్రస్తుతం తెలంగాణలో పాఠశాలలకే పరిమితమైన మధ్యాహ్న భోజన పథకాన్ని ఇక నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీలకూ విస్తరించనున్నారు. ఇంటర్ విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుంది. దీన్ని కూడా సోమవారం నుంచే 33 కాలేజీల్లో మొదలుపెడతారు. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 430 ప్రభుత్వ కాలేజీలు ఉన్నాయి. వాటిల్లో సుమారు 1.70 లక్షల మంది విద్యను అభ్యసిస్తున్నారు.



## ప్రపంచం కోసం భారత్ సరికొత్త ఆవిష్కరణలు

మొదటిపేజీ తరువాయి..

'భారత్ ఇన్నోవేట్స్' సదస్సులో ఆ దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో కలిసి మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ఉన్న బంధాన్ని, సాంకేతిక రంగంలో భారత్ సాధిస్తున్న ప్రగతిని ప్రధాని మోదీ కొనియాడారు. ఆవిష్కరణ అనేది భారతదేశ డీఎన్ఏలోనే ఉంది. వేల సంవత్సరాలుగా భారత్ తన జ్ఞానం, నూతన ఆవిష్కరణల ద్వారా ప్రపంచానికి సరికొత్త దిశను చూపిస్తూ వస్తోంది. గణితం నుంచి ఖగోళ శాస్త్రం వరకు, వైద్యం నుంచి యోగా వరకు భారత్ అందించిన సహకారం, సమస్త మానవాళి ప్రగతికి మూలాధారంగా నిలిచింది.

నేడు మనం అదే వారసత్వానికి సరికొత్త వేగాన్ని, సరికొత్త దిశను అందించాం. మీ( భారత యువత) సామర్థ్యాన్ని చూస్తూ నేను ఒకటే చెప్పగలను. భారత్ భారీ స్థాయిలో, అత్యంత వేగంతో ఆవిష్కరిస్తుంది. భారత్ సుస్థిర భవిష్యత్తు, సమస్త ప్రపంచం కోసం ఆవిష్కరిస్తుందని అన్నారు. భారత్‌కు చెందిన యువ ఆవిష్కర్తలు కేవలం స్థానిక సమస్యలకే కాకుండా, సమస్త మానవాళికి ప్రయోజనం చేకూర్చే సరికొత్త సాంకేతిక పరిష్కారాలను కనుగొంటున్నారని మోదీ ప్రశంసించారు. అలాగే, భారత్, ఫ్రాన్స్ మధ్య సంబంధాల గురించి మోదీ ప్రస్తావించారు. ఇరుదేశాల మధ్య ఉన్నది సాధారణ బంధం కాదని, అదొక ప్రత్యేక భాగస్వామ్యమని పేర్కొన్నారు. ఈ బంధానికి అనుసంధానం, దృఢ సంకల్పం, ఆవిష్కరణ, స్ఫూర్తి, ఉమ్మడి దృక్పథం ఐదు ముఖ్యమైన స్తంభాలని వివరించారు. భారత్ ఆవిష్కరణలకు నిలయమని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ అభివర్ణించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), వాతావరణ మార్పుల వంటి కీలక రంగాల్లో రెండు దేశాల మధ్య భాగస్వామ్యం ఉందని ఆయన పేర్కొన్నారు. తాము మేక్-ఇన్-ఇండియా కార్యక్రమాన్ని గౌరవిస్తున్నామని, వివిధ రంగాల్లో ఫ్రాన్స్ ఇందులో భాగస్వామిగా ఉందని మెక్రాన్ తెలిపారు. పౌర అణు శక్తి రంగంలో, ముఖ్యంగా 'స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల' విషయంలో ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఇక, 'భారత్ ఇన్నోవేట్స్ 2026' అనేది భారత ప్రభుత్వం చేపట్టిన ఒక కీలక కార్యక్రమం. ప్రపంచ వేదికపై దేశంలోని డీప్-టెక్ స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థల వృద్ధిని వేగవంతం చేయడం దీని లక్ష్యం. ఈ కార్యక్రమం భారత్, ఫ్రాన్స్‌తో పాటు ఇతర దేశాలకు చెందిన ప్రముఖ ఆవిష్కరణల స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటల్ సంస్థలు పాల్గొన్నాయి. ప్రస్తుతం ఫ్రాన్స్‌లో ఉన్న మోదీ, అక్కడ మెక్రాన్‌తో చర్చలు జరపడంతో పాటు +-7 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు.

# ఆరోగ్యరంగ భవిష్యత్తును మరింత విస్తృతం చేసే కృత్రిమ మేధస్సు

### యశోద హాస్పిటల్స్-హైటెక్ సిటీ లో భారతదేశంలోనే అతిపెద్ద ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్
### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా రెండు రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ప్రారంభం

యశోద హాస్పిటల్స్ నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సదస్సులో 2,000 మందికి పైగా వైద్యులు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, AI సాంకేతిక నిపుణులు పాల్గొని, ఆరోగ్యరంగంలో కృత్రిమ మేధస్సు (AI) విప్లవాత్మక పాత్ర, నూతన ఆవిష్కరణలు, భవిష్యత్ అవకాశాలపై విస్తృతంగా చర్చించనున్నారు




హైదరాబాద్, జూన్ 13, 2026: ఆరోగ్యరంగంలో కృత్రిమ మేధస్సు (AI) వినియోగం, ఆవిష్కరణలు మరియు భవిష్యత్ అవకాశాలపై ప్రపంచస్థాయి చర్చలకు వేదికగా నిలిచిన "ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ AI ఇన్ హెల్త్ కేర్ 2.0" సదస్సును యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ ఘనంగా ప్రారంభించింది. "పవరింగ్ ప్రెసిషన్ & పర్సనలైజింగ్ కేర్" అనే ప్రధాన అంశంపై జూన్ 13 మరియు 14 తేదీలలో నిర్వహించబడుతున్న దేశంలోనే అతిపెద్ద అంతర్జాతీయ వైద్య సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ వైద్యులు, వైద్య పరిశోధకులు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, AI సాంకేతిక నిపుణులు సహా 2,000 మందికి పైగా పాల్గొన్నారు. ఈ సదస్సును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు మరియు యశోద హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్. జి. ఎస్. రావు కలిసి ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించబడుతున్న ఈ అంతర్జాతీయ సదస్సు, ఆరోగ్య సేవల రంగంలో AI ఆధారిత విప్లవాత్మక మార్పులు, వినూత్న ఆవిష్కరణలు మరియు భవిష్యత్ అవకాశాలపై సమగ్ర చర్చలకు వేదికగా నిలిచింది. మొదటి ఎడిషన్ కు లభించిన విశేష స్పందనతో నిర్వహించిన ఈ సదస్సు, భారతదేశంలోనే ఆరోగ్య రంగానికి అంకితమైన అతిపెద్ద అంతర్జాతీయ AI సదస్సుగా గుర్తింపు పొందింది. డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి ఆర్గనైజింగ్ చైర్ పర్సన్ గా వ్యవహరించిన ఈ రెండు రోజుల సదస్సులో ప్రపంచవ్యాప్తంగా




2,000 మందికి పైగా వైద్య, సాంకేతిక, పరిశోధన మరియు విధాన రంగాల నిపుణులు పాల్గొన్నారు. ప్రెసిషన్ మెడిసిన్, AI ఆధారిత డయాగ్నస్టిక్స్, డిజిటల్ పాథాలజీ, రోబోటిక్ సర్జరీ, డ్రగ్ డిస్కవరీ, క్లినికల్ AI అప్లికేషన్స్ తదితర అంశాలపై విస్తృత చర్చలు జరిగాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐఐఐటీ హైదరాబాద్, ఐఐటీ హైదరాబాద్, ఐఎస్‌బీ, నోవార్టిస్, స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీ, కింగ్స్ కాలేజ్ లండన్, మెడ్ట్రానిక్, టీసీఎస్ తదితర ప్రముఖ సంస్థల నిపుణులు తమ అనుభవాలు, పరిశోధన ఫలితాలు మరియు భవిష్యత్ దృక్పథాలను పంచుకోగా, పాలసీ పావిలియన్, స్టార్టప్ ఇన్నోవేషన్ సెషన్లు సదస్సుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐటీ & పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, "ప్రపంచవ్యాప్తంగా AI ప్రతి రంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీస్తున్న తరుణంలో, ఆరోగ్యరంగం కూడా కీలక పరివర్తన దశలో ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం AI, డిజిటల్ ఇన్నోవేషన్ మరియు డీప్‌టెక్ రంగాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ సదస్సు పరిశోధన, స్టార్టప్ లు, పరిశ్రమలు మరియు విధాన నిర్ణేతల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసి, తెలంగాణను అంతర్జాతీయ స్థాయి ఇన్నోవేషన్ కేంద్రంగా నిలబెట్టే దిశగా కీలక పాత్ర పోషించిందని" మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. యశోద హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్. జి. ఎస్. రావు మాట్లాడుతూ, "ఆరోగ్యరంగంలో AI వినియోగం వైద్య సేవల నాణ్యత, వేగం మరియు ఖచ్చితత్వాన్ని గణనీయంగా మెరుగుపరుస్తోందన్నారు. వ్యాధులను ముందుగానే గుర్తించడం, క్లిష్టమైన కేసుల్లో మెరుగైన నిర్ణయాలు తీసుకోవడం, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్సలను అందించడం వంటి అంశాల్లో AI విశేష ఫలితాలను అందిస్తోందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఈ సదస్సు, ఆరోగ్యరంగ భవిష్యత్తుపై సార్థకమైన చర్చలకు దోహదపడటమే కాకుండా, కొత్త ఆవిష్కరణలు, భాగస్వామ్యాలు మరియు పరిశోధనలకు మార్గం సుగమం చేసిందని" డాక్టర్. జి. ఎస్. రావు తెలిపారు. యశోద హాస్పిటల్స్-హైటెక్ సిటీ, క్లినికల్ డైరెక్టర్ & రోబోటిక్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్. చినబాబు సుంకవల్లి మాట్లాడుతూ, "కృత్రిమ మేధస్సు కేవలం ఒక సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాదని, అది




ఆరోగ్యరంగ భవిష్యత్తును పునర్నిర్వచిస్తున్న పరివర్తనాత్మక శక్తి అని పేర్కొన్నారు. మరింత ఖచ్చితమైన వ్యాధి నిర్ధారణ, సమర్థవంతమైన వైద్య విధానాలు మరియు వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన చికిత్సలను అందించడంలో AI కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైద్య నిపుణులు, పరిశోధకులు, సాంకేతిక నాయకులు మరియు విధాన నిర్ణేతలను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఈ సదస్సు, ఆరోగ్యరంగంలో తదుపరి విప్లవానికి మార్గదర్శకంగా నిలిచిందని అన్నారు. అలాగే హైదరాబాద్ ను గ్లోబల్ హెల్త్ టెక్ హబ్‌గా మరింత బలోపేతం చేసే దిశగా ఇది ఒక ముఖ్యమైన ముందడుగుగా" డాక్టర్. చినబాబు సుంకవల్లి అభివర్ణించారు.

# సింగరేణి బొగ్గు గనుల అభివృద్ధే లక్ష్యం

### కార్మికుల సంక్షేమమే ప్రథమ లక్ష్యం
### ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
### శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని సందర్శన

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సింగరేణి బొగ్గు గనుల అభివృద్ధి, కార్మికుల సంక్షేమమే ప్రథమ లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఆయన తన రెండు రోజుల మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం నాడు శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిని స్వయంగా సందర్శించారు. ఆయనతో పాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్ తదితరులు ఈ కీలక పర్యటనలో పాల్గొన్నారు. ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం పూర్తిస్థాయి పరస్పర సమన్వయంతో సంస్థను మరింత ఉన్నత స్థితికి తీసుకెళ్లే దిశగా దృఢమైన అడుగులు వేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా పత్రికా ముఖంగా వెల్లడించారు.

శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలోకి నేరుగా దిగిన మంత్రుల బృందం అక్కడ జరుగుతున్న బొగ్గు వెలికితీత పనులను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించింది. గనిలో ప్రస్తుతం పాటిస్తున్న రక్షణ పద్ధతులు, బొగ్గు నాణ్యత ప్రమాణాలు, ఉత్పత్తి తీరు, కార్మికుల ఉత్పాదకత, రవాణా వ్యవస్థ తదితర కీలక అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రేడ్ 10, గ్రేడ్ 11 బొగ్గు నిల్వ ఉన్న ప్రదేశాలను వీక్షించి దానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఈ విస్తృత పర్యటనలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్



దీపక్, స్థానిక శాసనసభ్యుడు కె. ప్రేంసాగర్ రావు, ఎమ్మెల్సీ దండే విఠల్, సింగరేణి సంస్థ జనరల్ మేనేజర్లు, ఇతర ముఖ్య ఉన్నతాధికారులు పాలుపంచుకున్నారు. పర్యటన అనంతరం అధికారులతో, స్థానిక కార్మికులతో భట్టి విక్రమార్క మాట్లాడుతూ సింగరేణి కార్మికుల కఠిన శ్రమను మనసారా కొనియాడారు. కార్మికులు అహర్నిశలు తమ శ్రమను, చెమటను ధారపోసి బొగ్గును ఉత్పత్తి చేస్తూ యావత్ దేశానికే వెలుగులు పంచుతున్నారని ప్రశంసించారు. అటువంటి గొప్ప కార్మికుల ఆత్మగౌరవాన్ని అన్ని విధాలా కాపాడటం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతగా ఆయన బలంగా పేర్కొన్నారు. సింగరేణి సంస్థ తెలంగాణ రాష్ట్రానికే తలమానికమైన అతిపెద్ద ప్రభుత్వ రంగ ఆస్తి అని, ఇందులో ప్రతి పనీ అత్యంత పారదర్శకంగా సాగుతుందని స్పష్టం చేశారు. ఈ వాస్తవాలను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టి కొంతమంది పదే పదే అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. సంస్థ సర్వతోముఖాభివృద్ధికి కార్మికులు, అధికారులు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి వారికి భరోసా ఇచ్చారు. వారికి మరింత మెరుగైన వైద్య సేవలు త్వరితగతిన అందించేందుకు కార్పొరేట్ స్థాయి అధునాతన వైద్య పరికరాలను, నూతన వైద్య విధానాలను సింగరేణి ఆసుపత్రుల్లో అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. విద్యా రంగాన్ని సమూలంగా అభివృద్ధి చేసే ప్రణాళికలో భాగంగా జిల్లాలో ప్రతిష్టాత్మక 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను' నూతనంగా ఏర్పాటు చేయనున్నట్లు సగర్వంగా ప్రకటించారు. ప్రస్తుతమున్న ప్రభుత్వ పాఠశాలలను సైతం మెరుగైన సకల సౌకర్యాలతో ఆధునీకరిస్తామని చెప్పారు. గ్రామీణ స్థాయి నుంచే సాధారణ ప్రజల సమస్యల శాశ్వత పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ముఖ్యంగా సింగరేణి కార్మికుల పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం అవసరమైన అన్ని సత్వర చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్మికుల కుటుంబాలకు గట్టి ఆర్థిక భద్రత కల్పించే సదుద్దేశంతో ప్రభుత్వం ఇప్పటికే అత్యంత కీలక నిర్ణయాలు తీసుకుందని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ఇందులో ప్రధాన భాగంగా సింగరేణి కార్మికులకు ఏకంగా ఒక కోటి 25 లక్షల రూపాయల భారీ ప్రమాద బీమాను పూర్తిస్థాయిలో వర్తింపజేస్తున్నట్లు సంతోషంగా ప్రకటించారు. కార్మికుల పిల్లలు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలన్న బలమైన సంకల్పంతో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) లాంటి జాతీయ స్థాయి పరీక్షలకు, ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారికి ప్రభుత్వం తరపున అవసరమైన పూర్తి ఆర్థిక సహాయం అందిస్తామని స్పష్టం చేశారు. అంతిమంగా తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు పూర్తి సహకారం అందిస్తూ ప్రభుత్వంతో అడుగులు కలపాలని ఆయన హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేశారు.

## హ్యాపీ సండే కార్యక్రమాలకు విశేష స్పందన

### –యోగాంధ్రలో ప్రజలు భాగస్వామ్యం కావాలి: జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

సాక్ష్యం , విశాఖపట్నం.
రాష్ట్ర మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మార్గదర్శకాల మేరకు జీవీఎంసీ పరిధిలో ఆదివారం నిర్వహించిన "హ్యాపీ సండే" కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ,







కాలనీవాసులు, నివాసిత సంక్షేమ సంఘాలు, సీనియర్ సిటిజన్లు, విద్యార్థినీ విద్యార్థులు, వాకర్స్ క్లబ్ అసోసియేషన్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువతీ యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారని పేర్కొన్నారు.
ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవనశైలి, సామాజిక ఐక్యత, కమ్యూనిటీ భాగస్వామ్యాన్ని పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా చేపట్టనున్న "యోగాంధ్ర" కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హ్యాపీ సండే కార్యక్రమాల్లో భాగంగా యోగా ప్రాముఖ్యత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ క్రీడలు, యోగా, నృత్యాలు, పాటలు, మిమిక్రీ, సాంస్కృతిక, వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈస్ట్ జోన్ 19వ వార్డు లాసన్స్ బే కాలనీలో 114 మంది మహిళలతో పాటు స్థానిక ప్రజలు పాల్గొనగా, నార్త్ జోన్ 49వ వార్డు వైభవ్ పార్కులో కూడా సాంస్కృతిక, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. హ్యాపీ సండే కార్యక్రమాల నిర్వహణలో భాగస్వాములైన అందరికీ కమిషనర్ అభినందనలు తెలియజేస్తూ, రానున్న కార్యక్రమాల్లో మరింత మంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## జీవీఎంసీలో జీరో కరప్షన్ లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ

### అవినీతి ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు

సాక్ష్యం , విశాఖపట్నం.
గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)ను అవినీతి రహిత (జీరో కరప్షన్) సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. అధికారిక విధుల నిర్వహణలో జాప్యం చేసినా, అవినీతికి పాల్పడినా సంబంధిత అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.



ప్రజలు ఇటువంటి ఘటనలను వెంటనే జీవీఎంసీ టోల్‌ఫ్రీ నంబర్ 1800 4250 0009కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. పరిపాలనా ప్రక్రియలు, అభివృద్ధి పనులు, పౌర సదుపాయాల కల్పన, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అనుమతులు తదితర సేవల్లో జాప్యాలు చోటుచేసుకుంటే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. శాఖల సమీక్ష సమావేశాల్లో ఉన్నతాధికారులు, విభాగాధిపతులకు నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ప్రజల ఫిర్యాదులు, అనుమతులు, ఇతర శాఖలకు సంబంధించిన పెండింగ్ ఫైళ్లను రెండు రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్, రెవెన్యూ, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, హార్టికల్చర్ తదితర విభాగాలకు సంబంధించిన సేవల్లో జాప్యం, నిర్లక్ష్యం లేదా అవినీతి జరిగినట్లయితే టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయాలని ప్రజలకు కమిషనర్ విజ్ఞప్తి చేశారు. అందిన ప్రతి ఫిర్యాదును తానే స్వయంగా సమీక్షిస్తానని తెలిపారు. అవినీతి నిర్మూలన, పారదర్శక పాలన లక్ష్యాల సాధనలో ప్రజలు నిర్భయంగా ముందుకు వచ్చి జీవీఎంసీకి సహకరించాలని కమిషనర్ కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు.

## సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో దొంగల బీభత్సం

బాపట్ల పరిసర ప్రాంతాల్లో రైళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు చెలరేగిపోతున్నారు. ఈ మధ్య కాలంలో ఈ ప్రాంతాల్లో రైళ్లలో వరుస దొంగతనాలు ప్రయాణికులను వణికిస్తున్నాయి. తాజాగా తమిళనాడులోని



చెంగల్‌పట్టు నుంచి కాకినాడ పోర్ట్‌కు వెళుతున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆదివారం అర్ధరాత్రి దాటాక (సుమారు 1.15 గంటల సమయంలో) దొంగలు బీభత్సం సృష్టించారు. బాపట్ల శివారులోని నల్లమడ వాగు రైల్వే వంతెన సమీపంలో రైలు ప్రయాణిస్తుండగా, ఎస్–3, ఎస్–6 బోగీల్లో నిద్రిస్తున్న ఇద్దరు మహిళా ప్రయాణికుల నుంచి దుండగులు ఏడు సవర్ల బంగారు ఆభరణాలను లాక్కున్నారు. బాధితులు, ఇతర ప్రయాణికులు అప్రమత్తమై చైన్ లాగడంతో రైలు అక్కడికక్కడే నిలిచిపోయింది. ఈ క్రమంలో రైలులోనే ఎస్కార్ట్ విధుల్లో ఉన్న రైల్వే పోలీసులు తక్షణమే స్పందించి, పారిపోతున్న దుండగులపై 9 రౌండ్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మొత్తం ఆరుగురు దుండగులు పాల్గొన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు

## సేవా విలువలతో నైపుణ్య వికాసం – శ్రీ సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం

సాక్ష్యం , విశాఖపట్నం
శ్రీ సత్యసాయి సేవా సంస్థలు–ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ లో శిక్షణ పొందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ మహా సమ్మేళనం ఆదివారం విశాఖపట్నంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ హాలులో ఘనంగా నిర్వహించబడింది. వివిధ రంగాలకు చెందిన సుమారు 550 మంది పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తాము పొందిన శిక్షణ ద్వారా ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను ఎలా సద్వినియోగం చేసుకున్నారో వివరించారు. అలాగే, మానవతా విలువలు, సేవాభావం, ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలను తమ జీవితాల్లో ఎలా ఆచరిస్తున్నారో హృదయాన్ని హత్తుకునే విధంగా వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాఖపట్నం ఏసీపీ (క్రైమ్స్) భవ్య రెడ్డి



మాట్లాడుతూ, నేటి యువత సంప్రదాయ నైపుణ్యాలతో పాటు డిజిటల్ మార్కెటింగ్ వంటి ఆధునిక నైపుణ్యాలను కూడా అభ్యసించి తమ ఉపాధి అవకాశాలను మరింత విస్తరించుకోవాలని సూచించారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షులు ఆర్. లక్ష్మణరావు తన ప్రసంగంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా బోధించిన మానవ విలువలు, సేవా తత్వం, నైపుణ్యాభివృద్ధి ప్రాధాన్యతను వివరించారు. నైపుణ్యంతో కూడిన సేవా దృక్పథమే సమాజాభివృద్ధికి నిజమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా హెల్త్ కేర్ అసిస్టెంట్ శిక్షణా కార్యక్రమం నిర్వహించేందుకు లభించిన అనుమతి పత్రాన్ని సభాముఖంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పూర్వ విద్యార్థుల అనుభవాల పంచుకోవడం, భవిష్యత్ అవకాశాలపై చర్చలు, సేవా కార్యక్రమాల పట్ల అంకితభావాన్ని మరింత బలోపేతం చేసేలా ఈ సమ్మేళనం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

## భోగాపురం వచ్చినా విశాఖ విమానాశ్రయం కొనసాగించాలి: విష్ణుకుమార్ రాజు

సాక్ష్యం , విశాఖపట్నం.
భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా విశాఖ విమానాశ్రయాన్ని దేశీయ విమానాశ్రయంగా కొనసాగించాలని, ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఎలాంటి వివక్షకు తావు ఉండకూడదని విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే, బీజేపీ శాసనసభా పక్ష నేత పి.




విష్ణుకుమార్ రాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం బీచ్ రోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలో 4,400 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశానికి స్థిరమైన, సమర్థవంతమైన పాలన అందుతోందని పేర్కొన్నారు. దేశీయ, అంతర్జాతీయ దౌత్య రంగాల్లో కేంద్ర ప్రభుత్వం విశిష్ట నాయకత్వాన్ని ప్రదర్శించిందని తెలిపారు.
భారతీయ జనతా పార్టీ హామీలు ఇచ్చే పార్టీ మాత్రమే కాదని, వాటిని అమలు చేసే పార్టీ అని పేర్కొన్న ఆయన, ప్రధాని ఆవాస్ యోజన కింద దేశవ్యాప్తంగా 4.25 కోట్లకు పైగా కుటుంబాలకు గృహాలు అందించామని చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో సుమారు 2.5 లక్షల మంది అర్హులైన లబ్ధిదారులు ఇళ్లకు దూరమయ్యారని ఆరోపించారు. మహిళల గౌరవాన్ని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాల ద్వారా 12.5 కోట్లకు పైగా కుటుంబాలకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించిందన్నారు. అమృత్ భారత్ పథకం ద్వారా దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్ల ఆధునీకరణ చేపడుతున్నామని, మోదీ ప్రభుత్వ హయాంలోనే విశాఖపట్నం రైల్వే జోన్ ఏర్పాటు సాధ్యమైందని పేర్కొన్నారు. రైల్వే జోన్‌కు అవసరమైన భూమి, మౌలిక సదుపాయాల కల్పనకు ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.
విశాఖ నుంచి ఆదాయం వచ్చే రైల్వే స్టేషన్లను తరలిస్తున్నారంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించిన ఆయన, ఈ నెల 19న విశాఖపట్నంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 2019–24 మధ్య పాలించిన గత ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించి కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారని పేర్కొన్న విష్ణుకుమార్ రాజు, అభివృద్ధి ప్రధానమైన, ప్రజాకేంద్రీకృత పాలన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విశాఖపట్నాన్ని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు భారీగా నిధులు కేటాయిస్తున్నామని, ప్రస్తుతం నెలకు 2.5 లక్షల మందికి పైగా ప్రయాణికులు విశాఖ విమానాశ్రయాన్ని వినియోగిస్తున్నారని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభం పేరుతో విశాఖ విమానాశ్రయ కార్యకలాపాలను పూర్తిగా తరలిస్తే ప్రయాణికులకు అదనపు సమయం, ఇబ్బందులు ఎదురవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. భోగాపురం విమానాశ్రయం అభివృద్ధి పేరుతో విశాఖ విమానాశ్రయాన్ని మూసివేయకూడదని, భోగాపురం విమానాశ్రయం ప్రారంభమైన తర్వాత కూడా విశాఖ విమానాశ్రయాన్ని దేశీయ విమానాశ్రయంగా కొనసాగించి ప్రాంత ప్రజల అవసరాలను తీర్చాలని విష్ణుకుమార్ రాజు డిమాండ్ చేశారు.

## సింగపూర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన స్వాగతం

సాక్ష్యం , విశాఖపట్నం
రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు





నాయుడు తన బృందంతో కలిసి ఆదివారం సింగపూర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి తెలుగు ప్రజలు, ఎన్నారైలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన తెలుగు కుటుంబాలు ముఖ్యమంత్రిని ఆత్మీయంగా ఆహ్వానించాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, వారితో కలిసి ఫోటోలు దిగారు. ప్రవాస భారతీయులతో ఆయన కొద్దిసేపు ముచ్చటించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటన పట్ల సింగపూర్‌లోని తెలుగు సంఘాల ప్రతినిధులు, ఎన్నారైలు హర్షం వ్యక్తం చేశారు.

## కోనూరు వద్ద కృష్ణా నదిలో ఘోర పడవ ప్రమాదం

### – నలుగురు మృతి, బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

సాక్ష్యం , విశాఖపట్నం.
పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం కోనూరు గ్రామ సమీపంలోని కృష్ణా నదిలో ఆదివారం జరిగిన విషాదకర పడవ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, మరో ఆరుగురు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ప్రస్తుతం సింగపూర్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి, ప్రమాదంపై పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా సహా ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.





గ్రామంలో జరిగిన శుభకార్యానికి హాజరైన అనంతరం ఒకే కుటుంబానికి చెందిన బంధువులు, చిన్నారులతో కలిపి మొత్తం పది మంది కృష్ణా నదిలో విహారయాత్రకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పడవ సమతుల్యత కోల్పోయి బోల్తా పడటంతో ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న స్థానిక మత్స్యకారులు, సహాయక బృందాలు వెంటనే స్పందించి ఆరుగురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగా, నలుగురు నీటిలో గల్లంతయ్యారు. అనంతరం ఎన్డీఆర్ఎఫ్, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది చేపట్టిన గాలింపు చర్యల్లో మృతదేహాలను వెలికితీశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా వెంటనే ఏరియా ఆసుపత్రికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో కలిసి బాధితులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని కలెక్టర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రమాదానికి గల కారణాలపై రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ శాఖల అధికారులతో ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. నదిలో మిగిలిన ఆరుగురు వ్యక్తులు సురక్షితంగా ఉన్నారని స్పష్టం చేశారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పడవ ప్రయాణాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మత్స్యకారులకు, నదీ తీర ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం ప్రత్యేక సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విషాద ఘటనతో కోనూరు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మృతులకు ఘన నివాళులు అర్పిస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## చీలిక దిశగా శివసేన!?

శివసేన ఉద్ధవ్ వర్గం చీలిక వచ్చిందంటూ ప్రచారం సాగుతోంది. ఆపరేషన్ టైగర్ దెబ్బకు శివసేన (యూబీటీ)లో చీలిక వచ్చిందని, ఆ పార్టీకి చెందిన 9 మంది ఎంపీలు ఏకనాథ్ శిందే నేతృత్వంలోని



శివసేనలో చేరనున్నారనే వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే దీనిపై ఆ పార్టీ నేత, ఎంపీ సంజయ్ రౌత్ స్పందించారు. శివసేన (యూబీటీ) పార్లమెంట్ సభ్యులంతా కలిసి కట్టుకట్టుగానే ఉన్నారని అన్నారు. తమ పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో ఈ ఎంపీలంతా పాల్గొన్నారని పేర్కొన్నారు. కనుక మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఏకనాథ్ శిందే నేతృత్వంలోని శివసేన చేరనున్నారనే వార్తలను నమ్మవద్దని కోరారు. ప్రస్తుతం మహారాష్ట్రలో 'ఆపరేషన్ టైగర్' పేరుతో రాజకీయ రచ్చ జరుగుతోంది. 9 మంది శివసేన (యూబీటీ) ఎంపీలలో ఏడుగురు శిందే సేనతో టచ్‌లో ఉన్నారని, వారు త్వరలో ఎన్‌డీఏలో చేరే అవకాశం ఉందంటూ వార్తలు వచ్చాయి. బంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో కూడా ఇలాంటి అంతర్గత సంక్షోభం నెలకొని ఉంది. ఇప్పటికే టీఎంసీకి చెందిన 20 మంది ఎంపీలు పార్టీ అధినేత్రి మమతా బెనర్జీపై తిరుగుబాటు చేశారని, లోక్‌సభలో తమను తాము ప్రత్యేక గ్రూపుగా ఏర్పడడానికి సిద్ధంగా ఉన్నారనే వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మహారాష్ట్రలో 'ఆపరేషన్ టైగర్'పై సర్వత్రా ఉత్కంఠ చెలరేగింది. అయితే శివసేన (యూబీటీ) నేతలు మాత్రం తమ పార్టీలో అంతర్గత విభేదాలు ఉన్నాయన్న వార్తలను ఖండిస్తున్నారు. ఆ పార్టీకి చెందిన ఎంపీ అనిల్ దేశాయ్ మాట్లాడుతూ, "మా ఎంపీలు, ఎమ్మెల్యేలు రెగ్యులర్‌గా సమావేశం అవుతుంటారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక సందర్భం అక్కరలేదు. ఇందులో వింతేమీ లేదు. మా 9 మంది ఎంపీలు అంతా కలిసికట్టుగా ఉన్నారు. మీడియాలో వస్తున్నవన్నీ అనవసర ఊహాగానాలే" అని అన్నారు. శివసేన (యూబీటీ)కి చెందిన మరో నేత అరవింద్ సావంత్ మాట్లాడుతూ, కొందరు ఎంపీలు ఆన్‌లైన్‌లో హాజరవ్వడానికి గల కారణాలు చెప్పారు. "ఒక సభ్యుని బిడ్డ అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్నారు. మరొక ఎంపీ భార్యకు ఒంట్లో బాగాలేదు. ఇంకొకరి కుమార్తె వివాహం జరుగుతోంది. కాబట్టి ప్రతి ఒక్కరూ ఈ పరిస్థితులను అర్థం చేసుకోవాలి" అని పేర్కొన్నారు. శివసేన (యూబీటీ) అధినేత, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే ఆదివారం ముంబయిలోని తన నివాసంలో ఒక సమావేశం నిర్వహించారు. అక్కడకు నేరుగా పార్టీ ఎంపీలు అనిల్ దేశాయ్, సంజయర్ రౌత్, రాజాభౌ పరాగ్ ప్రకాశ్ వాజే చేరుకున్నారు. సంజయ్ దేశ్‌ముఖ్, నగేశ్ పాటిల్ అష్టూర్ ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. కానీ ఆ పార్టీ ఎంపీలు పార్టీ మారనున్నారనే వార్తలు మాత్రం హల్‌చల్ చేస్తున్నాయి.

## మూడో విజయాన్ని నమోదు చేసిన అమరావతి రాయల్స్

### – విశాఖపట్నం వేదికలో ముగిసిన పోటీలు

సాక్ష్యం , విశాఖపట్నం.
ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో జరుగుతున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)–2026 సీజన్–5లో ఆరో రోజు తొలి మ్యాచ్‌లో క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్టు భీమవరం బుల్స్‌పై 8 పరుగుల తేడాతో విజయం సాధించి సీజన్‌లో తన మూడో విజయాన్ని నమోదు చేసుకుంది. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది.టాస్ గెలిచిన అమరావతి రాయల్స్ తొలుత బ్యాటింగ్




ఎంచుకుంది. ఓపెనర్లు త్వరగా పెవిలియన్ చేరడంతో జట్టుకు శుభారంభం లభించకపోయినా, మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు జట్టును ఆదుకున్నారు. వర్షం కారణంగా మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడటంతో అంపైర్లు ఒక ఓవర్‌ను కుదించి 19 ఓవర్ల మ్యాచ్‌గా నిర్వహించారు. అమరావతి జట్టు 18.4 ఓవర్లలో 169 పరుగులకు ఆలౌట్ అయింది. వన్‌డౌన్ బ్యాటర్ వెంకట రాహుల్ 20 బంతుల్లో 43 పరుగులు (3 ఫోర్లు, 4 సిక్సర్లు) చేసి కీలక ఇన్నింగ్స్ ఆడగా, కరన్ షిండే 23 బంతుల్లో 33 పరుగులు (4 ఫోర్లు), కోడి వెంకట శశికాంత్ 24 బంతుల్లో 38 పరుగులు (4 సిక్సర్లు) చేసి జట్టుకు పోరాడే స్కోరు అందించారు. భీమవరం బుల్స్ బౌలర్లలో సత్యనారాయణ రాజు మూడు వికెట్లు, సాయి శ్రవణ్ రెండు వికెట్లు తీశారు. 170 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భీమవరం బుల్స్‌కు ఓపెనర్ హేమంత్ రెడ్డి శుభారంభం అందించాడు. అతడు 38 బంతుల్లో 59 పరుగులు (4 ఫోర్లు, 3 సిక్సర్లు) సాధించాడు. సాయి శ్రవణ్ 26 బంతుల్లో 40 పరుగులు (5 ఫోర్లు, 1 సిక్సర్) చేసి పోరాడినప్పటికీ, మిగతా బ్యాటర్లు విఫలమవడంతో ఆ జట్టు నిర్ణీత 19 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 163 పరుగులు మాత్రమే చేయగలిగింది.దీంతో క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్టు 8 పరుగుల తేడాతో విజయం సాధించి సీజన్‌లో మూడో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న కోడి వెంకట శశికాంత్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఇదిలా ఉండగా, ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్–5లో భాగంగా విశాఖపట్నం వేదికగా గత ఆరు రోజులుగా నిర్వహించిన మ్యాచ్‌లు నేటితో ముగియనున్నాయి. రాత్రి జరగనున్న రెండో మ్యాచ్‌లో విజయవాడ సన్‌షైనర్స్, సింహాద్రి వైజాగ్ లయన్స్ జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌తో విశాఖపట్నం వేదిక లో ప్రకటించిన పోటీలకు తెరపడనుంది. తదుపరి దశ పోటీలకు కడప, మంగళగిరి వేదికలుగా వ్యవహరించనున్నాయి. జూన్ 17 నుంచి కడపలోని వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో లీగ్ మ్యాచ్‌లు కొనసాగనున్నాయి. అనంతరం జూన్ 24 నుంచి మంగళగిరిలోని ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో మిగిలిన లీగ్ మ్యాచ్‌లతో పాటు ప్లేఆఫ్ పోటీలను నిర్వహించనున్నారు.

సాక్ష్యం

రాష్ట్రీయం STATE

హైదరాబాద్
సోమవారం 15 జూన్ 2026



# రక్తదానం మరొకరికి ప్రాణదానం

## – ఎమ్మెల్యే జీఎస్సార్



**భూపాలపల్లి జూన్ 14 (సాక్ష్యం) :** ఈరోజు ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఐటీ మాస్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని భూపాలపల్లి శాసనసభ్యులు శ్రీ గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రక్తదానం అత్యున్నతమైన మానవతా సేవ అని అన్నారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రమాద బాధితులు, శస్త్రచికిత్సలు చేయించుకునే రోగులు,గర్భిణీలు మరియు ఇతర రోగులకు రక్తం ఎంతో అవసరమవుతుందని పేర్కొన్నారు.ప్రతి



ఆరోగ్యవంతమైన వ్యక్తి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.రక్తదానం వల్ల దాత ఆరోగ్యానికి ఎలాంటి హాని ఉండదని,నిర్దిష్ట వ్యవధిలో రక్తదానం చేయడం ద్వారా సమాజానికి అమూల్యమైన సేవ చేసిన వారవుతారని తెలిపారు.యువత సామాజిక బాధ్యతతో రక్తదాన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని మానవత్వాన్ని చాటాలని సూచించారు.భూపాలపల్లి జిల్లా కేంద్రంలో రెడ్ క్రాస్ సొసైటీని ఏర్పాటు చేశామని ఆరు నెలల్లో పూర్తవుతుందని తెలిపారు. అనంతరం రక్తం దానం చేసిన దాతలకు సర్టిఫికెట్ల అందజేశారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులు వేముల శంకర్ గారిని మరియు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిని అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ అంబాల శ్రీనివాస్ గారు,స్థానిక ప్రజాప్రతినిధులు, ఐటీ మాస్టర్ సభ్యులు, యువకులు, రక్తదాతలు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# తోటి స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక చేయూత




**కోదాడ జూన్ 14, (సాక్ష్యం)** సూర్యాపేట జిల్లా మునగాల మండలం కొక్కిరేని గ్రామంలో పదో తరగతి వరకు కలిసి చదువుకున్న స్నేహితులలో మరణించిన కొక్కిరేని గ్రామానికి చెందిన గాజుల రవి, చెట్ల ముకుందపురం గ్రామానికి చెందిన ఎల్లావుల సైదులు కుటుంబాల ఆర్థిక పరిస్థితిని గమనించిన సహపాఠులు అందరూ కలిసి విరాళాలు సేకరించి, ఆదివారం వారి కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా స్నేహితులు మాట్లాడుతూ, కష్టకాలంలో కుటుంబాలకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావించి ఈ సహాయం చేసినట్లు తెలిపారు. వారి ఈ మంచి కార్యక్రమం అందరికీ ఆదర్శంగా నిలిచింది. స్నేహం అంటే కేవలం కలిసి ఉండటం కాదు, అవసర సమయంలో అండగా నిలవడమే నిజమైన స్నేహం అని నిరూపించారు.

# అనారోగ్యంతో ప్రభుత్వ ఉద్యోగి మృతి

## – నివాళులు అర్పించిన ఫౌండేషన్ చైర్మన్

**రాయపర్తి, జూన్ 14(సాక్ష్యం):** మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగి భూక్య యకూబ్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ



జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి వారి పార్థివా దేహానికి నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించినారు. కార్యక్రమంలో రాయపర్తి మండల మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్, సర్పంచ్ లు చిన్నపాక రాంబాబు, గుగులోత్ రమేష్, గ్రామ పార్టీ ఇంచార్జి నలామాష సారయ్య, మాజీ సర్పంచ్ లు గూబ ఎల్లయ్య, పార్టీ ముఖ్య నాయకులు రాఘవ రెడ్డి, జగన్, గుగులోత్ గౌస్, ఎనగందుల సామ్రాట్, బాలు నాయక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక బాధ్యతను చాటిన నాగర్‌కర్నూల్ వైద్య విద్యార్థులు




**నాగర్ కర్నూల్ : జూన్ 14 : (సాక్ష్యం)** ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల, నాగర్‌కర్నూల్‌లో మెడికోస్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరంలో మొత్తం 52 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేయగా, వారిలో ముగ్గురు మహిళా విద్యార్థులు ఉన్నారు. మొత్తం 52 యూనిట్ల రక్తం సేకరించబడింది. భావి వైద్యుల్లో సేవాభావం, మానవతా దృక్పథం, సామాజిక బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిబిరానికి ముందు కళాశాల ప్రిన్సిపాల్ డా. దావూద్ సులేమాని ప్రపంచ రక్తదాతల దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించి, స్వచ్ఛంద రక్తదానం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం రక్తదాతలకు వైస్ ప్రిన్సిపాల్ డా. మహిత, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. ఉషారాణి, అసోసియేట్ ప్రొఫెసర్లు డా. ఆకర్ష్, డా. నివేదిత, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డా. అనిత, ఆర్ఎంఓ డా. రోహిత్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికోస్ బ్లడ్ డోనర్స్ క్లబ్ వాలంటీర్లు భాను ప్రకాష్ రెడ్డి, వర్షిత్, శివ సోహన్ లు పాల్గొన్నారు.

# నీవు ఎవరో నీకు తెలిపేది త్రైత సిద్ధాంత భగవద్గీత

## శ్రీనగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం

**కోదాడ జూన్ 14, (సాక్ష్యం)** నీవు ఎవరో నీకు తెలిపి, పరమాత్మను చేరేందుకు దిశా నిర్దేశం చేసేది త్రైత సిద్ధాంత భగవద్గీత మాత్రమేనని ఇందూ జ్ఞాన వేదిక, త్రైత సిద్ధాంతం కోదాడ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో త్రైత సిద్ధాంత గ్రంథాల ఇంటింటి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం కోకొల్లలుగా ఉన్న స్వామీజీలు, బాబాలు పలానా పూజ చేస్తే పలానా ఫలితం వస్తుందని, పలానా వస్తువు దానం చేస్తే పలానా పని నెరవేరుతుందని చెబుతున్నారని, బ్రహ్మవిద్యా శాస్త్రం భగవద్గీత ప్రకారం చేసే ప్రతి పనికి రెండు ఫలితాలు ఉంటాయని, ఒకటి కంటికి కనిపించే ఫలితమని, మరొకటి కంటికి కనిపించని సూక్ష్మ ఫలితమైన అగామి కర్మ అని, కర్మ వలన మళ్లీ మళ్లీ జన్మించాల్సి వస్తుందని, కర్మలను లేకుండా చేసుకుంటేనే పరమాత్మను చేరగలుగుతామని ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత స్పష్టం చేస్తుందన్నారు. ప్రపంచ కోర్కెలు నెరవేర్చబడవు, దేవుని జ్ఞానం తెలుపబడును అని ఆశ్రమం ముందు బోర్డు పెట్టుకోవడమే కాకుండా, ముందస్తు ప్రణాళికలు లేకుండా ఆదివారం అమావాస్య రోజున ప్రబోధాశ్రమం నిర్మాణానికి ముగ్గు పోయించిన ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వర్ణించలేని గొప్ప స్వామీజీ అన్నారు. త్రైత సిద్ధాంతం ఆధారంగా ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన 101 గ్రంథాలు మానవాళికి దిక్సూచి అన్నారు. ఇంటింటి ప్రచారంలో ముత్తవరపు శైలజ, వంగాల మహేష్, సైదా, నర్సింహారావు పాల్గొన్నారు.



# స్థానిక గిరిజనేతర భూముల్లో, స్థానికేతర గిరిజనులు భూ ఆక్రమణ

**ఏటూరునాగారం, జూన్ 14, :** ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఐటీడీఏ క్రాస్ రోడ్ రాళ్ళకుంట చెరువు శివారు భూములలో స్థానికేత గిరిజనులు, పూర్వం నుండి ఉంటున్న స్థానిక గిరిజనేతరుల పంట పొలాల భూముల్లో ఆక్రమణకు పాల్పడుతుండడంతో ఆదివారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరుగుతుందని సమాచారం తెలుసుకున్న ఏటూరునాగారం ఎస్సై బొంకురి మహేష్ తమ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానిక గిరిజనేతర రైతులకు, భూఆక్రమణకు వచ్చిన స్థానికేతర గిరిజనులకు నడుమ జరుగుతున్న వాగ్వాదాన్ని అడ్డుకుని విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. స్థానికేతర గిరిజనుల వివరణ ఇలా ఉంది మేము ఆదివాసీయులం ఈ ప్రాంతంలో ఎక్కడి భూములలో అయిన మేము ఉండే హక్కులు రాజ్యాంగం మాకు చట్టాలు కల్పించిందని, అందుకే మేము ఈ భూములలో నివాసాలు ఏర్పాటు చేసుకుంటామని ఎస్సైకి తెలిపారు. స్థానిక గిరిజనేతరుల వివరణ ఇలా ఉంది.





**చట్టాలను అడ్డుపెట్టుకుని ఆక్రమణలకు పాల్పడుతున్నారని గిరిజనేతరుల ఆవేదన**

మేము పూర్వం నుండి ఈ భూములలో సాగుచేసుకుంటూ జీవనం పొందుతున్నాము ప్రాణాలైన వదిలేస్తాం భూముల జోలికి వస్తే ఊరుకోమని, వేర్వేరు ప్రాంతాల్లోంచి ఇక్కడికి వచ్చి కబ్జాలకు పాల్పడి గిరిజన,గిరిజనేతరులుగా విభజిస్తూ తగాదాలు సృష్టించాలని చూస్తే ఊరుకోమని ప్రజాస్వామ్య బద్ధంగా పోరాటం చేస్తూ స్థానికేతరుల ఆగడాలను అడ్డుకుంటామని ఎస్సైకి వివరనిచ్చారు. ఇరువర్గాల వివరణ విన్న ఎస్సై ఇలా అన్నారు. ఖాళీగా ఉన్న భూములలో ఈ విధంగా గుడిసెలు వేసుకోవచ్చని మీ వద్ద ఏమైన జీవోలు ఉంటే తీసుకురండీ అంతేకాని ఎలాంటి ఆధారాలు లేకుండా ఇలా ఘర్షణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలుంటాయని ఎస్సై మహేష్ తెలిపారు.

# ప్రజా సేవకు పట్టా నాయకత్వానికి శిక్షణ

## – నేటి నుంచి వార్డు సభ్యుల మొదటి విడత శిక్షణా తరగతులు – ఎంపిడిఓ కూచన ప్రకాష్

**రాయపర్తి, జూన్ 14(సాక్ష్యం):** గ్రామ పంచాయతీల వార్డు సభ్యుల సమర్థతను, పాలనా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు నేటి నుంచి అయిదు రోజుల పాటు శిక్షణ తరుగతులు ప్రారంబిస్తున్నట్లు ఎంపిడిఓ కూచన ప్రకాష్ తెలిపారు. రాయపర్తి లో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 20 వరకు మొదటి విడుత 5 రోజుల పాటు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను బ్యాంచ్ – × నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ కూచన ప్రకాష్ తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా వార్డు సభ్యులకు స్థానిక సంస్థల విధులు, నిధుల వినియోగం, గ్రామ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన మరియు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నారు. మొదటి విడత బ్యాచ్ – × శిక్షణకు ఎంపికైన గ్రామాలు పట్టిక ప్రకారం చూపిన 13 గ్రామాల పరిధిలోని మొత్తం 113 మంది వార్డు సభ్యులు హాజరు కావాలని ఎంపిడిఓ కోరారు. అందరూ తప్పనిసరిగా నేడు రాయపర్తి మండల వార్డు సభ్యుల మొదటి విడత శిక్షణా తరగతులకు ఉదయం 10 గంటలకు శిక్షణా కేంద్రానికి చేరుకుని, ఈ 5 రోజుల శిక్షణను విజయవంతం చేయవలసిందిగా కోరారు. వార్డు సభ్యుడు అంటే ఓట్లు అడిగే నాయకుడు మాత్రమే కాదు ప్రజలకు సేవ చేసే సేవకుడు అని. వార్డులో రోడ్డు ఉందా, డ్రైనేజీ ఉందా, వీధి దీపం వెలిగిందా అనేది వార్డు సభ్యుల బాధ్యత ఉంటుందని ఎంపిడిఓ కూచన ప్రకాష్ అన్నారు. నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరూ హాజరై గ్రామ సంక్షేమానికి, అభివృద్ధికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.




గ్రామపంచాయతీ భవనం

Rayaparthy Mdl Ward Members Training Batch - I
Date : 15-06-2026 - 20-06-2026

| S.No. | Name of the Village | No. of Wards |
|---|---|---|
| 1 | Are Gudem | 6 |
| 2 | Bhurhanpally | 10 |
| 3 | Errakunta Thanda | 6 |
| 4 | Gannaram | 8 |
| 5 | Jayaram Thanda | 8 |
| 6 | Jethuram Thanda | 8 |
| 7 | Jinkuram Thanda | 6 |
| 8 | Keshavapur | 8 |
| 9 | Kolanpally | 10 |
| 10 | Kondur | 12 |
| 11 | Rayaparthy | 14 |
| 12 | Tettekunta Thanda | 7 |
| 13 | Thirumalaipally | 10 |

మొదటి విడత గ్రామపంచాయితీల వారిగా వార్డు సభ్యుల శిక్షణ పట్టిక

ప్రజా సేవకు పట్టా నాయకత్వానికి శిక్షణ

నేటి నుంచి వార్డు సభ్యుల మొదటి విడత శిక్షణా తరగతులు -ఎంపిడిఓ కూచన ప్రకాష్

రాయపర్తి, జూన్ 14(సాక్ష్యం): గ్రామ పంచాయతీల వార్డు సభ్యుల సమర్థతను, పాలనా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు నేటి నుంచి అయిదు రోజుల పాటు శిక్షణ తరుగతులు ప్రారంబిస్తున్నట్లు ఎంపిడిఓ కూచన ప్రకాష్ తెలిపారు. రాయపర్తి లో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 20 వరకు మొదటి విడుత 5 రోజుల పాటు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను బ్యాంచ్ – × నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ కూచన ప్రకాష్ తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా వార్డు సభ్యులకు స్థానిక సంస్థల విధులు, నిధుల వినియోగం, గ్రామ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన మరియు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నారు. మొదటి విడత బ్యాచ్ – × శిక్షణకు ఎంపికైన గ్రామాలు పట్టిక ప్రకారం చూపిన 13 గ్రామాల పరిధిలోని మొత్తం 113 మంది వార్డు సభ్యులు హాజరు కావాలని ఎంపిడిఓ కోరారు. అందరూ తప్పనిసరిగా నేడు రాయపర్తి మండల వార్డు సభ్యుల మొదటి విడత శిక్షణా తరగతులకు ఉదయం 10 గంటలకు శిక్షణా కేంద్రానికి చేరుకుని, ఈ 5 రోజుల శిక్షణను విజయవంతం చేయవలసిందిగా కోరారు. వార్డు సభ్యుడు అంటే ఓట్లు అడిగే నాయకుడు మాత్రమే కాదు ప్రజలకు సేవ చేసే సేవకుడు అని. వార్డులో రోడ్డు ఉందా, డ్రైనేజీ ఉందా, వీధి దీపం వెలిగిందా అనేది వార్డు సభ్యుల బాధ్యత ఉంటుందని ఎంపిడిఓ కూచన ప్రకాష్ అన్నారు. నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరూ హాజరై గ్రామ సంక్షేమానికి, అభివృద్ధికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# వడ్డెర గూడెం గ్రామానికి బిటి రోడ్డు నిర్మించండి : గామస్తుల విన్నపం

## బిఆర్‌యస్ నాయకులు ఒర్సు ముత్యాలు

**డిండి. సాక్షం న్యూస్ :** మా గ్రామానికి బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలని రోడ్డు పై వెళ్లాలంటే ఎన్నో అవస్థలు పడాల్సి వస్తుందని వడ్డెర గూడెం గ్రామస్థులు, ఆ గ్రామ బి ఆర్ యస్ అధ్యక్షులు ఒర్సు ముత్యాలు కోరుతున్నారు. గ్రామస్తులు, ఆయన ఆదివారం పత్రికలతో మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ స్పందించి ఇక నైనా సదరు కాంట్రాక్టర్ తో మాట్లాడి బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నామన్నారు. దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం బాధాకరం అన్నారు. వివరాలు డిండి మండలంలోని వావిలి కోల్ గ్రామపంచాయతీ పరిధిలోని వడ్డెర గూడెం గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించాలని,కంకర పరచి, బీటీ వేయడం మరిచారని దీనివల్ల ప్రజలు, వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగి ఎంతోమంది వాహనదారులు కిందపడి గాయాల పాలయ్యారని, వానొస్తే మడుగుల మాదిరిగా నీళ్ల నిండి ప్రజలు అవస్థలు పడుతున్నా అధికారులు స్పందించడం లేదని, నిరసనలు వ్యక్తం చేసి, పత్రికల్లో వార్తలు ప్రచురితమైనా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం హాస్యాస్పదమని, బిఆర్ఎస్ వడ్డెర గూడెం గ్రామ శాఖ అధ్యక్షులు ఒర్సు ముత్యాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వడ్డెర గూడెం, బ్రాహ్మణపల్లి,బ్రాహ్మణపల్లి తండా ప్రజల ప్రధాన రహదారి అయిన వడ్డెరగూడెం రహదారిని బీటీ రోడ్డు వేసేలా స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ చొరవ చూపి వీలైనంత త్వరగా బీటీ రోడ్ నిర్మాణం చేపట్టేలా అధికారులకు ఆదేశించాలని ముత్యాలు కోరారు.



# వర్షాకాల అప్రమత్తతపై అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశాలు

**మహబూబ్‌నగర్, జూన్ 14 ( సాక్ష్యం బ్యూరో )** జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, విపత్తు నిర్వహణ చర్యలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదివారం వెబెక్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్డీఓలు, డీఆర్డీఓ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, విద్యుత్, ఇరిగేషన్, మిషన్ భగీరథ శాఖల ఎస్ఈలు, డీఈలు, ఈఈలు, ఏఈలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో తహసీల్దార్లు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులుగా వ్యవహరించాలని సూచించారు. గత వర్షాకాలంలో ఎదురైన సమస్యలు, వాటి పరిష్కారాలు, ఈ ఏడాది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఏ సమస్య తలెత్తినా వెంటనే స్పందించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో ప్రజలకు అవసరమైన సూచనలు అందించేందుకు గ్రామ, మండల స్థాయి అధికారుల సంప్రదింపు నంబర్లు అందుబాటులో ఉంచాలని, ప్రతి రెండు రోజులకు ఒకసారి గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే మండలాల్లో గజ ఈతగాళ్ల వివరాలను ఫోన్ నంబర్లతో సిద్ధంగా ఉంచి, అత్యవసర పరిస్థితుల్లో వారి సేవలను వినియోగించి ప్రాణనష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. వర్షపు నీరు రోడ్లపై ప్రవహించే ప్రాంతాలు, కాజ్‌వేలు, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, వైర్లు దెబ్బతిన్నట్లయితే సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టేలా తహసీల్దార్లు పర్యవేక్షించాలని సూచించారు. సోమవారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నందున పాఠశాల పరిసరాలను పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రంగా ఉంచేందుకు ఎంపీడీఓలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి మండలంలో ఎంపీడీఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, గ్రామాల నుంచి వచ్చే సమాచారాన్ని మండల, డివిజన్ స్థాయి అధికారులకు వెంటనే చేరవేసే విధంగా వ్యవస్థను సిద్ధం చేయాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మండల స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ హెచ్చరించారు.



## తాపీ మేస్త్రిల రేట్ల పెంపు కోసం
# యాప్రాల్‌లో రిలే నిరాహార దీక్ష



**సికింద్రాబాద్, జూన్ 14 (సాక్ష్యం):** తాపీ మేస్త్రిలు, కాంట్రాక్టర్ల శ్రమకు తగిన ప్రతిఫలం లభించడం లేదని ఆరోపిస్తూ తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో యాప్రాల్‌లో రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ నిర్మాణ రంగంలో పెరుగుతున్న ధరలు, జీవన వ్యయం దృష్ట్యా తాపీ మేస్త్రిలు మరియు కాంట్రాక్టర్ల పనికి అనుగుణంగా రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి శ్రమకు సరైన గౌరవం, పారితోషికం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాపీ మేస్త్రిల రేట్లు పెంచే వరకు రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిర్మాణ కార్మికుల



సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు తాపీ మేస్త్రిలు, కాంట్రాక్టర్లు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొని సంఘీభావం తెలిపారు. తాపీ మేస్త్రిల ఐక్యతతో తమ హక్కులను సాధించుకునేందుకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై వెంకటేష్, ఏ ఐ టి యు సి జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ సింగ్, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి అమరావతి బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి జంగయ్య అల్వాల్ ఏఐటియుసి అధ్యక్షులు నరేంద్ర చారి సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు చంద్రయ్య,యాప్రాల్ తాపీ మేస్త్రి ల సంఘం అధ్యక్షుడు ఎస్ శాంసన్,ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ,కోశాధికారి ఎస్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆలేటి రమేశ్‌కు ఎమ్మెల్యే
# బండారి లక్ష్మారెడ్డి జన్మదిన శుభాకాంక్షలు



**ఉప్పల్, జూన్ 14 (సాక్ష్యం):** ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి తన వ్యక్తిగత సహాయకుడు ఆలేటి రమేశ్ జన్మదిన సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాప్రతినిధి కార్యాలయ కార్యకలాపాల్లో సమన్వయంతో, నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే విధంగా ఆలేటి రమేశ్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో, నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల అమలులో సహకరిస్తూ సేవాభావంతో పనిచేస్తున్న ఆయన కృషిని ఎమ్మెల్యే అభినందించారు. భవిష్యత్తులో ఆలేటి రమేశ్ మరిన్ని విజయాలు సాధించాలని, ఆయురారోగ్యాలు, మంచి ఆరోగ్యం, సుఖసంతోషాలతో చిరకాలం వర్ధిల్లాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు.

## ఓయూ క్యాంపస్‌లో బీఆర్ఎస్
# ఆధ్వర్యంలో ఓటరు నమోదు సవరణ కార్యక్రమం





**సికింద్రాబాద్, జూన్ 14 (సాక్ష్యం):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయ క్యాంపస్‌లోని క్యాంప్ నంబర్-6 పరిధిలో బూత్ నంబర్లు 218, 219, 220లకు సంబంధించిన ప్రత్యేక ఓటరు నమోదు సవరణ (సర్) కార్యక్రమాన్ని జింకల మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌చార్జ్‌గా సుందర్ వ్యవహరించగా, ఓయూ క్యాంపస్ బీఆర్ఎస్ నాయకులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ప్రత్యేక హాజరుగా సుందర్, జింకల మల్లేష్ (జీహెచ్ఎంసీ మాజీ జనరల్ సెక్రటరీ) హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, సవరణలు, చిరునామా మార్పులు తదితర అంశాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించారు. పార్టీ శ్రేణులు బూత్ స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.డి. ఖాజా పాషా, యాకూబ్ షరీఫ్, ముజీహీద్, అరుణ్ కుమార్, సబర్, వరికుప్పల శ్యామ్, జాకర్ హుస్సేన్, అబ్దుల్ ఫైజ్, ఇషాక్, అలీ, ఫయాక్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలను నిర్వాహకులు అభినందించారు.

# సెంట్రింగ్ అసోసియేషన్ నాయకులు క్షమాపణ చెప్పాలి
### - సెంట్రింగ్ అసోసియేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం: మల్లెల శ్రీను



**సికింద్రాబాద్, జూన్ 14 (సాక్ష్యం)** భవన నిర్మాణ రంగాల కార్మికులపై అనుచిత వాఖ్యలు చేసిన సెంట్రింగ్ కాంట్రాక్ట్ అసోసియేషన్ నాయకులు భేషరుతుగా క్షమాపణ చెప్పాలని లేని యెడల సెంట్రింగ్ అసోసియేషన్ కార్యలయాన్ని ముట్టడిస్తామని లాలాపేట శ్రీ లక్ష్మీ దుర్గా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం లాలాపేటలోని శ్రీ లక్ష్మీ దుర్గా భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతు సెంట్రింగ్ కాంట్రాక్ట్ అసోసియేషన్ నాయకులు రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో మాట్లాడటం సరికాదన్నారు. వారి రెచ్చగొట్టే వ్యాఖ్యలను మానుకోవాలని హితవు పలికారు. భవన నిర్మాణ రంగాల కార్మికులకు భవన నిర్మాణ పనులతో పాటు సెంట్రింగ్ పనులు కూడా తెలుసన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. సెంట్రింగ్ అసోసియేషన్ నాయకులు తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మల్లెల శ్రీను, ప్రదాన కార్యదర్శి మల్లికార్జునన్, సుబ్బారావు, సుధాకర్, మాదవ్, విఠల్, మాల్యాద్రి, మోహన్, శ్రీను, అనాజ్, తదితరులు పాల్గోన్నారు.

# ఎస్ఐఆర్ సభ్యత్వ నమోదు శిక్షణా కార్యక్రమం

**పాలకుర్తి జూన్ 14(సాక్ష్యం):** బిఆర్ఎస్ పార్టీ పాలకుర్తి నియోజవర్గ సర్ సభ్యత్వ నమోదు కార్యక్రమ శిక్షణ తరగతుల కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, తాటికొండ రాజయ్య, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, అరూరి రమేశ్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా కో ఆర్డినేటర్ వై సతీష్ రెడ్డి, మోటివేషనల్ స్పీకర్ శ్రీపాద రామ్, హన్మకొండ మాజీ జెడ్పీ ఛైర్మన్ సుధీర్ కుమార్,రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# యర్రగొండపాలెంలో టీడీపీకి భారీ ఊపు

**మార్కాపురం జిల్లా బ్యూరో: సాక్ష్యం** యర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు సమర్థ,నిబద్ధత గల నాయకత్వంలో యర్రగొండపాలెం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠ అనూహ్యంగా పెరిగింది.క్షేత్రస్థాయిలో ఆయన అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి బ్రహ్మరథం లభిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి,సంక్షేమం, సుపరిపాలన దిశగా నడిపిస్తూ నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడు రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం 15 జూన్ 2026న యర్రగొండపాలెంలో " విజయోత్సవ " కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.

**సమయం :ఉదయం 10:00 గంటలకు**

వేదిక : యర్రగొండపాలెంలో పట్టణంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో తెదేపా ఇంఛార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పనితీరు,ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్న తీరుతో నియోజకవర్గంలో టీడీపీ గ్రాఫ్ రోజురోజుకూ పెరుగుతోంది." అభివృద్ధే లక్ష్యం... ప్రజాసేవే ధ్యేయం " అనే కూటమి ప్రభుత్వ నినాదం ప్రజల హృదయాలను గెలుచుకుంటోంది.




- గూదూరి ఎరిక్షన్ బాబు వైపు చూస్తున్న ప్రజలు
- 15న విజయోత్సవ సభ కు భారీ స్థాయిలో సభ ఏర్పాటుకు సిద్ధం
- అతి త్వరలో వైసీపీ నుండి వందలాది కుటుంబాలు టీడీపీలోకి

**రెండేళ్లలో సాధించిన ప్రధాన విజయాలు...**

1.ప్రజా దర్బార్ : నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది అర్జీలకు సత్వర పరిష్కారం.

2.గ్రామాభివృద్ధి : రోడ్లు,తాగునీరు, వీధిలైట్లు వంటి మౌలిక వసతుల కల్పన.

3.సంక్షేమ పంపిణీ : కూటమి ప్రభుత్వ పథకాలను గడపగడపకు చేరవేత.

4.భరోసా : యువతకు ఉపాధి,రైతులకు అండగా నిలిచిన నాయకత్వం.

**విశ్వసనీయ సమాచారం :** నియోజకవర్గంలో సంచలన రాజకీయ పరిణామం చోటుచేసుకోనుంది. గూదూరి ఎరిక్షన్ బాబు నాయకత్వం పై పూర్తి విశ్వాసంతో,కూటమి ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలనకు ఆకర్షితులై వైసిపి నుండి వందలాది కుటుంబాలు అతి త్వరలోనే తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకోనున్నాయి. గ్రామస్థాయిలో జరుగుతున్న ఈ భారీ చేరికలు నియోజకవర్గ రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చేయనున్నాయి.

ఇప్పటికే పలువురు కీలక నేతలు,కార్యకర్తలు ఎరిక్షన్ బాబు తో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. నేడు జరగనున్న ఈ విజయోత్సవ సభను చరిత్రలో నిలిచిపోయేలా జయప్రదం చేసేందుకు తెలుగుదేశం,బీజేపీ,జనసేన పార్టీల శ్రేణులు వేలాదిగా తరలిరావాలని గూదూరి ఎరిక్షన్ బాబు పిలుపునిచ్చారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో బీఎల్ఏలదే కీలక బాధ్యత
### - ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి





**సికింద్రాబాద్, జూన్ 14 (సాక్ష్యం):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) పాత్ర అత్యంత కీలకమని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పేర్కొన్నారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ నాయకత్వంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో లాలాపేటలోని నఫీస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన బీఎల్ఏల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్, తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్, టీపీసీసీ అధికార ప్రతినిధి కల్వ సుజాత, టీపీసీసీ ఉపాధ్యక్షుడు కైలాష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బీఎల్ఏల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రతి బూత్ పరిధిలో అర్హులైన ప్రతి ఓటరును గుర్తించి జాబితాలో నమోదు చేయడం, కొత్త ఓటర్ల పేర్లు చేర్చడం, తప్పులను సవరించడం, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను తొలగించడం వంటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, సమగ్రతను కాపాడేందుకు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆదం సంతోష్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంలో బీఎల్ఏలు, కార్యకర్తల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి బూత్‌లో పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీడీ అమర్‌నాథ్ గౌడ్, జామా అనిల్, బ్రహ్మాజీ, కిషోర్ యాదవ్, పర్వేజ్, గండికోట కుమార్, రాజేందర్ యాదవ్, శిల్పా చారి, షకీల్, వహీద్, గుంటి కృష్ణ, గణేష్ యాదవ్, శైలేందర్, అనిరుద్ తదితరులతో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, బీఎల్ఏలు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భూ తగాదాలు పెట్టిస్తున్న తహశీల్దార్
# నాడు ఓ రిపోర్ట్ నేడు ఓ రిపోర్ట్ తన్నుకుసస్తున్న ప్రజలు

**మహబూబాబాద్ జిల్లా రిపోర్టర్ సాక్ష్యం జూన్ 14)** నిన్న మహబూబాబాద్ పట్టణ శివారు ఈదుల పూస పల్లి గ్రామంలో 447,449 సర్వే నెంబర్లకు చెందిన భూ యజమానులు,మరి కొందరితో కలిసి 448 సర్వే నెంబర్ తో మేము తప్పుడు భూమి డాక్యుమెంట్స్ సృష్టించి,వాళ్ళ భూమి కాజేయాలని ప్రయత్నం చేస్తున్నట్టు వాళ్లు నా మీద ఆరోపణలు చేయడం జరిగింది.వాళ్లు వివరించి నట్టే దూపటి దర్గయ్య అనే వ్యక్తికి రెండు ఎకరాలు,అలాగే మెంతుల శ్రీను,ఉదయ్ చందర్ కుటుంబానికి ఏడు ఎకరాల పదకొండు గుంటల భూమి అమ్మడం జరిగింది.ఇది వాళ్ళు చెప్పింది.వాస్తవం కూడా కానీ మేము భూమి కొనుగోలు చేసింది ఎంత.? అనే విషయాన్ని వాళ్ళు చెప్పలేదు. 1974లో 11:05 (11ఎకరాల ఐదు గుంటల)భూమిని కొదుమూరి రంగయ్య అనే పెద్దమనిషి వద్ద మా నాన్న భూమి కొనుగోలు చేసి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగింది.అప్పటి పాత పాస్ బుక్కులు ఉన్నాయి, పహాణీ రికార్డుల్లో నమోదు అవుతున్నాయి.భూమి శిస్తు రసీదులు సైతం ఉన్నాయి.ఆ రిజిస్ట్రేషన్ పై వాళ్లకు తొమ్మిది 9:11 గుంటల భూమి అమ్ముకున్నాం.మిగతా 1: 34గుంటల భూమి మాకు రికార్డుల్లో ఉంది.దానికి పాస్ బుక్ కూడా ఉంది.గత ఏడాది మండల సర్వేయర్ చే సర్వే చేయించుకున్న తర్వాత మా మిగతా భూమి పైకి మేము వెళుతూ ఉంటే ఇప్పుడు నాపై ఆరోపణలు చేస్తున్న వాళ్లే పలుమార్లు మాపై దాడికి ప్రయత్నం చేశారు.వీళ్ళ వేధింపుల వల్ల మా నాన్నగారు చనిపోయారు.మా నాన్న చనిపోయిన తర్వాత కూడా మా కుటుంబం పై వాళ్ళ వేధింపులు ఆగలేదు.మా మీద వారు కలెక్టర్ కి ఫిర్యాదు చేయగా 1974 నుంచి ఇప్పటివరకు ఉన్న మా రికార్డులన్నీ మేము కూడా కలెక్టర్ అందజేశం.మాకు భూమి ఉందో, లేదో ఆ డాక్యుమెంట్లు అసలువో,నకిలీవో అధికారులే నిర్ధారిస్తారు.సర్వే నెంబర్లు 447, 448,449 భూమికి సరిహద్దులు కూడా వాళ్లే నిర్ణయిస్తారు.మా డాక్యుమెంట్లు నకిలీవైతే చట్టప్రకారము ఎలాంటి శిక్షకైనా నేను సిద్ధమే అని అహ్మద్ ఖాన్ తెలిపారు.ఈ సమావేశంలో దివంగత యూసుఫ్ అలీ ఖాన్ కుటుంబ సభ్యులు అహ్మద్ ఖాన్ తో పాటు మహమ్మద్ అలీ ఖాన్,లియాఖత్ అలీ ఖాన్,నదీమ్ ఖాన్,సైఫ్ అలీ ఖాన్ పాల్గొన్నారు.



# బాలాజీ ఎంక్లేవ్ నూతన అధ్యక్షుడిగా వేణుగోపాల్ రెడ్డి ఎన్నిక



**ఉప్పల్, జూన్ 14 (సాక్ష్యం):** బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని బాలాజీ ఎంక్లేవ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం నిర్వహించగా, నూతన అధ్యక్షుడిగా వేణుగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఓంకార్ సింగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఓంకార్ సింగ్ తమ కమిటీ సభ్యులతో కలిసి మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలాజీ ఎంక్లేవ్ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని వారు కోరారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా సీహెచ్ ప్రవీణ్ రావు, జాయింట్ సెక్రటరీగా సిద్ధేశ్వర్, ఖజాంచిగా పీజీ వెంకటేశ్వర్ ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా శరభయ్య, డి. శంకర్, శ్రీనివాసాచారి, గౌతమ్, సాయికుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు కాలనీవాసులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, బాలాజీ ఎంక్లేవ్ సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.



## ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను
# కలిసిన కాంగ్రెస్ నాయకులు రావెళ్ళ





**కోదాడ జూన్ 14, (సాక్ష్యం)** కోదాడ పట్టణంలోని గుడుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై బీఎల్ఏలకు ఆదివారం జరిగిన శిక్షణ శిబిరానికి హాజరై కోదాడ కాంగ్రెస్ నాయకులు కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌లను కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణా రావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేసి, పార్టీ బలోపేతం, ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో , పిల్లుట్ల శ్రీనివాస్ పాలడుగు సంజు మైలార్శెట్టి భాస్కర్ లైటింగ్ ప్రసాద్ పాల్గొన్నారు.

## జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ విప్లవయోధుడు చేగువేరా జయంతి

చౌటుప్పల్ 14 జూన్ (సాక్ష్యం)
చౌటుప్పల్ మండల కేంద్రంలో జనసేన పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ విప్లవయోధుడు చేగువేరా జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా చేగువేరా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జనసేన పార్టీ మండల నాయకులు ఆముదాల పరమేష్ ఆధ్వర్యంలో పైలాన్ పార్క్, తంగేడు వనంలో చెత్తబుట్టలను పంపిణీ చేశారు. చేగువేరా జీవితం, ఆయన విప్లవ భావజాలం, సామాజిక సేవా స్ఫూర్తిని తెలియజేసే పుస్తకాలను యువతకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..దేశం జాతీ మతం అని సరిహద్దులను దాటి మానవత్వం కోసం పోరాడిన మహనీయుడు చేగువేరా అని అన్నారు. ప్రపంచ యువతలో సామాజిక చైతన్య పోరాట స్ఫూర్తి సేవా భావాన్ని నింపిన చేగువేరా ప్రజల కోసం జీవించడం అవసరమైతే ప్రజల కోసమే ప్రాణం త్యాగం చేయడం అనే సందేశాన్ని తన జీవితంతో చూపించిన మహోన్నత వ్యక్తి చేగువేరా అని







అన్నారు. అలాంటి చేగువేరా స్ఫూర్తితో సమాజం కోసం, దేశం కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే ప్రతి జనసైనికుడు చేగువేరాను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలి అని



పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆముదాల పరమేశ్,బొల్లం మల్లేశ్, చిన్నం ప్రశాంత్,బద్రి రాజు, చిన్నం రాజీవ్, పెద్దగొని లింగస్వామి, సరికొండ సంజయ్, పాశం శ్రీనాథ్, శ్రీకాంత్, ముద్దం రాజు, గణేష్, దొడ్డి వంశీ, బాలగోని శివ, తదితరులు పాల్గొన్నారు.

## అనుమానస్పదంగా యువకుడి మృతి

చౌటుప్పల్ జూన్ 14 (సాక్షం )
చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామంలో ఒక ఫామ్ హౌస్ లో అనుమానస్పదంగా యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే హైదరాబాదులోని ఒక ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్న మంచిర్యాల జిల్లాకు చెందిన గుండ్ల రాము (27)అనే యువకుడు అతనితో పని చేసే 15 మంది ఉద్యోగస్తులతో కలిసి శనివారం చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామంలోని ఒక ఫామ్ హౌస్ లో వీకెండ్ పార్టీ చేసుకున్నారు. మిత్రులతో కలిసి ఘర్షణకు గురైన రాము ఘర్షణ సద్దుమణిగిన తర్వాత రాత్రి ఒంటిగంటకు రాము స్పృహ కూలిపోవడంతో చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే రాము మరణించినట్లు వైద్యులు సూచించారు. ఘటనపై సమాచారం అందుకున్న చౌటుప్పల్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని



పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రిలో భద్రపరిచారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ మన్మథ కుమార్ తెలియజేశారు.


### భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని

## లాడ్జిలలో సీసీఎస్ పోలీసుల ఆకస్మిక తనిఖీలు

భూపాలపల్లి జూన్ 14 ( సాక్ష్యం) :
జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసులు ఆదివారం తెల్లవారుజామున భూపాలపల్లిలోని పలు లాడ్జిలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లాడ్జిలలో నిర్వహిస్తున్న అతిథుల రిజిస్టర్లు, సీసీ కెమెరాల పనితీరు, బస చేస్తున్న వ్యక్తుల వివరాలను



పరిశీలించారు. లాడ్జిలకు వచ్చే ప్రతి వ్యక్తి వివరాలు, ఆధార్ కార్డు వివరాలు, రాకపోకల




సమయాలను తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు. నిబంధనలను పాటించని పక్షంలో సంబంధిత లాడ్జి నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా భద్రత, నేరాల నియంత్రణలో భాగంగా ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

### బాధిత కుటుంబాలకు

## ఆర్థికసహాయం అందించిన గడ్డం పురుషోత్తం రెడ్డి

మాడ్గులపల్లి, జూన్ 14 సాక్ష్యం;
మాడుగులపల్లి మండలంలోని కుక్కడం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన నల్లగంతుల సైదులు, బొంగరాల సైదులు కుటుంబాలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు, మాడ్గులపల్లి మండల యంగ్ డైనమిక్ లీడర్ గడ్డం పురుషోత్తం రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ,చెరో రూ.5,000 చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ పెద్దలను కోల్పోయిన బాధిత కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే బొంగరాల సైదులు కుమార్తెల విద్యాభ్యాసం విషయంలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. పేద విద్యార్థుల చదువుకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

## స్వామివారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు జస్టిస్

యాదగిరి కొండ సాక్షి న్యూస్....
ఆదివారం రోజు సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడి ఘంటం నరసింహ శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తికి ఆలయ అధికారులు, ప్రధాన అర్చకులు పూర్ణ కుంభం తో సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి అమ్మవార్ల ఆశీస్సులు పొందారు. ఆలయ అర్చకులు, వేదంపండితులు వేదాశీర్వచనం అందించి, తీర్థ ప్రసాదాలు సమర్పించారు. అనంతరం అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి శ్రీ స్వామివారి ప్రసాదం చిత్రపటం అందజేశారు. ఆలయ ప్రాంగణంలో కొంతసేపు గడిపిన న్యాయమూర్తి, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులతో మాట్లాడారు. దర్శనం అనంతరం ఆలయ అభివృద్ధి, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీ స్వామివారిని దర్శించడం తమ అదృష్టమని పేర్కొన్నారు.





## విద్యార్థులకు హీరో విజయ్ దేవరకొండ రష్మిక నగదు ప్రోత్సాహకాలు

నాగర్ కర్నూల్ : జూన్ 14 : (సాక్ష్యం)
నాగర్ కర్నూల్ జిల్లాలో సినీ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న సందడి చేశారు. తమ వివాహ సమయంలో చేసిన వాగ్దానానికి అనుగుణంగా విద్యార్థుల ప్రోత్సాహం కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని 47 ప్రభుత్వ పాఠశాలల్లో 9వ, 10వ తరగతుల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన మొత్తం 181 మంది









విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. దేవరకొండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొదటి ర్యాంకు సాధించిన వారికి రూ.10 వేలు, రెండో ర్యాంకు సాధించిన వారికి రూ.5 వేల చొప్పున బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో విజయ్ దేవరకొండ కుటుంబ సభ్యులు మాధవి, గోవర్ధన్ రావు, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ పాల్గొన్నారు. బల్మూర్ మండలం తుమ్మన్‌పేట గ్రామ సమీపంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో విద్యార్థులకు వారి చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.

## ఇందుగులలో ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మాడుగులపల్లి జూన్ 14 సాక్ష్యం;
మాడుగుల పల్లి మండలంలోని ఇందుగుల ప్రభుత్వ పాఠశాలలో 2008-09 బ్యాచ్ కి సంబంధించిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు గతంలో తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయ బృందంతో కలిసి ఆదివారం జిల్లా పరిషత్ హై స్కూల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందానికి పూలదండలతో స్వాగతం పలికి వారికి శాలువాలతో సన్మానం చేశారు. అందరూ ఒకరినొకరు ప్రేమానురాగాలతో ఆప్యాయంగా పలకరించుకుంటూ సంతోషం వ్యక్తం చేశారు. చిన్ననాటి జ్ఞాపకాల స్మృతులను తమ ఉపాధ్యాయ బృందంతో పంచుకుంటూ నా హృదయ ఫలకాలను నెమరు వేసుకున్నారు. ఒక్కొక్క విద్యార్థి చిన్ననాటి మరపురాని సన్నివేశాలను గుర్తు చేసుకుంటూ తమ అనుభవాలను చెప్పుకున్నారు. ఏవైనా తప్పులు చేసి ఉంటే



క్షమించండి అంటూ తమ ఉపాధ్యాయ బృందాన్ని కోరినారు. ఈ ఆనందకరమైన సమయాన ఉపాధ్యాయ బృందం కూడా విద్యార్థులతో తమ తమ అనుభవాలను పంచుకున్నారు. అదేవిధంగా విద్యార్థులు తప్పులు చేయడం సహజమేనని మేము దండించడం సహజమేనని ఆ సమయంలో విద్యార్థులపై ఎలాంటి ద్వేషము ఉండదని విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టడమే ఉపాధ్యాయుల లక్షణమని వారిని ప్రేమతో పలకరిస్తూ వారితో కలిసిపోతూ మా దారిలోకి తీసుకురావడం మంచి మార్గం అని ఉపాధ్యాయులు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు తమ ఆశీస్సులు అందజేశారు. ప్రతి ఒక్కరూ వివిధ రంగాలలో ఎదగాలని మనస్ఫూర్తిగా చెప్పుకొచ్చారు. ఈ యొక్క కార్యక్రమానికి విద్యార్థి బృందం నుండి బాల్నే నాగిరెడ్డి కోడదల లింగస్వామి చెరుకు సతీష్ ఎర్ర రవి చింతపల్లి సతీష్ నగిరే నరసింహ కోడదల శంకర్ పందిరి కళ్యాణ్ పందిరి సైదులు దారమల్ల నాగరాజు పుట్ట నాగయ్య ఇండ్ల రవి జెర్రిపోతుల స్వప్న పందిరి అనిత పాల్గొనగా ఉపాధ్యాయ బృందం నుండి ప్రధానోపాధ్యాయులైనా సుదర్శన్ పందిరి వీరస్వామి దామోదర్ రెడ్డి ముజీబు శ్రవణ్ కుమార్ నాగేంద్ర చారి పద్మలత గార్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో నిత్యారాధనలు : యాదాద్రిలో భక్తజన సందోహం

యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్
పంచనారసింహులు కొలువై ఉన్న యాదాద్రి పుణ్యక్షేత్రంలో అదివారం భక్తజనుల ఆరాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ఆదివారం సెలవురోజు కావడంతోయాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో పెరిగిన భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం నుంచే తమ కుటుంబ సభ్యులతో క్యూలైన్ల లో బారులు తీరిన భక్తులు..భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ఆలయ మాడవీధులు,కళ్యాణకట్ట, పుష్కరిణి, వ్రత మండపం, వాహనాల పార్కింగ్, ఘాట్ రోడ్డు పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ధర్మ దర్శనం. 3గంటల సమయం, ప్రత్యేక ప్రవేశ దర్శనం,గంట సమయం పడుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు క్షేత్రాన్ని సందర్శించి హరి, హరులను దర్శించుకున్నారు. భక్తులు తమ కుటుంబీకులతో కొండ కింద లక్ష్మీ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, సంకల్పం చేపట్టారు.



పలువురు తలనీలాలు సమర్పించారు. శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. శనివారము ఆదివారం రెండు రోజులలో లక్ష 15 వేల మంది భక్తులు స్వామివారి దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. ఆదివారము వివిధ కైంకర్యాలలో 71,70,982/- ఆదాయం వచ్చినదని ఆలయ అధికారులు తెలిపారు.





## అమావాస్య వేళ తెరుచుకుంటున్న స్కూల్స్: ఆర్టీసీ స్పెషల్ బస్సులు


హైదరాబాద్ జూన్ 14 (సాక్ష్యం)
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రేపటి (సోమవారం) నుంచి పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. షెడ్యూల్ ప్రకారం జూన్ 12 వరకే వేసవి సెలవులు ఉన్నప్పటికీ.. రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం సెలవులను నేటి (ఆదివారం) వరకు పొడిగించిన సంగతి తెలిసిందే. దీంతో సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు రేపటి నుంచి మళ్లీ పాఠశాలల బాట పట్టనున్నారు. ఒకవైపు విద్యాశాఖ, మరోవైపు రవాణా శాఖ విద్యార్థుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థుల సురక్షిత ప్రయాణానికి అన్ని రకాల చర్యలు చేపట్టినట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ం+టూ=ుజ) మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో ఉండబోయే 227 పనిదినాల్లో.. పాఠశాలల వేళలకు అనుగుణంగా అన్ని రూట్లలో ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆయన వెల్లడించారు. ముఖ్యంగా హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎక్కువగా ప్రయాణించే రూట్లను పునరుద్ధరించామని, ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు బస్సులను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా స్కూళ్లకు చేరుకునేలా ఆర్టీసీ సిబ్బంది పర్యవేక్షించనున్నారు. కొత్త విద్యాసంవత్సరం మొదటి రోజు నుంచే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేసేందుకు విద్యాశాఖ పక్కా ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే దాదాపు 80 శాతం పుస్తకాలు అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చేరుకున్నాయి. ఇక ప్రభుత్వం అందించే ఉచిత యూనిఫామ్స్, షూస్‌తో కూడిన 'ఎడ్యుకేషన్ కిట్'ను ఈ నెలాఖరులోగా విద్యార్థులకు పంపిణీ చేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉంటే, స్కూళ్ల ప్రారంభం రోజునే తల్లిదండ్రులను ఒక విచిత్రమైన సెంటిమెంట్ వేధిస్తోంది. రేపు సోమవారం 'అమావాస్య' కావడంతో, మొదటి రోజే పిల్లలను బడికి పంపడానికి కొందరు పేరెంట్స్ సంకోచిస్తున్నారు. పోనీ మరుసటి రోజు (మంగళవారం) పంపుదామా అంటే.. సాధారణంగా మంగళవారాన్ని కొత్త పనులకు శుభప్రదమైన రోజుగా భావించరు. దీంతో అటు అమావాస్య, ఇటు మంగళవారం సెంటిమెంట్ల కారణంగా చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను నేరుగా బుధవారం (జూన్ 17) నుంచి పాఠశాలలకు పంపాలని భావిస్తుండటం గమనార్హం. దీనివల్ల మొదటి రెండు రోజులు పాఠశాలల్లో హాజరు శాతం కాస్త తక్కువగా ఉండే అవకాశం కనిపిస్తోంది.



## హైదరాబాద్‌లో కాక్రోచ్ విశ్వరూపం

హైదరాబాద్ జూన్ 14 (సాక్ష్యం)
దేశ విద్యా రంగాన్ని కుదిపేస్తున్న నీట్ (చీజుజు-ఖ+) ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై కాక్రోచ్ జనతా పార్టీ (జబీు) చేపట్టిన దేశవ్యాప్త నిరసన జ్వాలలు భాగ్యనగరానికి తాకాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలనే ప్రధాన డిమాండ్‌తో హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వేదికగా సీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ బహిరంగ నిరసన ప్రదర్శన జరిగింది. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న పాలకుల తీరుకు వ్యతిరేకంగా తరలివచ్చిన ఆందోళనకారులతో ఇందిరా పార్క్ పరిసరాలు జనసంద్రంగా మారాయి. "ధర్మేంద్ర ప్రధాన్ ఇస్తీఫా దో", "గోడీ మీడియా హై హై" అంటూ నినాదాలతో ధర్నా చౌక్ మార్మోగింది. ఈ మహాధర్నాకు ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్, ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ రావు, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి హాజరై తమ మద్దతు ప్రకటించారు. ఈ నిరసన సభను ఉద్దేశించి ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ రావు మాట్లాడుతూ.. విద్యావ్యవస్థలో ఇంత పెద్ద కుంభకోణం జరిగినా కేంద్ర మంత్రి పదవిలో కొనసాగడం సిగ్గుచేటన్నారు. గతంలో ఒక రైలు ప్రమాదం జరిగినప్పుడు నైతిక బాధ్యత వహిస్తూ నాటి రైల్వే మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి తన పదవికి రాజీనామా చేసిన చారిత్రాత్మక ఉదాహరణను ఆయన గుర్తుచేశారు. నేటి పాలకులు కనీస నైతిక బాధ్యత లేకుండా విద్యార్థుల జీవితాలను బలిపీఠం ఎక్కిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు అధ్వాన్నంగా మారడం వల్లే పేదలు ప్రైవేట్ సంస్థల వైపు వెళ్లాల్సి వస్తోందని సభలో పాల్గొన్న పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థలో వేళ్లూనుకున్న కులతత్వానికి రోహిత్ వేముల లాంటి ఎందరో మేధావులు బలిపశువులవుతున్నారని సీజేపీప్రతినిధి విజేత దహియా మండిపడ్డారు. ఈ లీకేజీల వల్ల పేద కుటుంబాల ఆశలు ఎలా సమాధి అవుతున్నాయో వివరిస్తూ ఆకాంక్ష చతుర్వేది, ప్రదీప్ అనే విద్యార్థుల ఉదంతాలను సభలో ప్రస్తావించారు. డాక్టర్ చదివి కుటుంబ కష్టాలు తీరుస్తానని.. తండ్రి తెచ్చిన మూడు లక్షల అప్పు తీరుస్తానని నమ్మకంగా ఉన్న ఆకాంక్ష, పేపర్ లీక్ వార్తలతో మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడిన ఉదంతం కన్నీళు పెట్టించింది. చనిపోయిన కొడుకు కెమిస్ట్రీ పుస్తకాన్ని గుండెలకు హత్తుకుని నేటికీ రోదిస్తున్న ఒక పేద తండ్రి వేదనను సభ ముందు ఉంచారు. "అసమర్థులు, చదువురాని వారు ఉన్నత స్థానాల్లో కూర్చుంటే సమాజానికి ముప్పు వాటిల్లుతుంది. ఈ అబద్ధాల నెట్‌వర్క్‌ను ఛేదించేందుకే ఈ కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం పుట్టింది" అని నేతలు స్పష్టం చేశారు.

### చింతల సుభద్ర పార్థివ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



చౌటుప్పల్ జూన్ 14 (సాక్ష్యం)
చౌటుప్పల్ మాజీ సర్పంచ్ చింతల కృష్ణారెడ్డి సతీమణి చింతల సుభద్ర మరణించడంతో వారి పార్థివ దేహానికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని నివాళు లర్పించారు.




# పాకిస్తాన్ మహిళా జట్టుపై భారత మహిళా జట్టు భారీ విజయం

## స్మృతి మంధన హాఫ్ సెంచరీ..

ఇంగ్లాండ్‌లోని ఎడ్జ్‌బాస్టన్, బర్మింగ్‌హామ్‌లో జరిగిన విమెన్స్ టీ20 వరల్డ్ కప్ 2026 ఆరవ మ్యాచ్‌లో భారత మహిళా జట్టు పాకిస్తాన్ మహిళా జట్టుపై భారీ విజయం సాధించింది. టాస్ గెలిచిన భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ బ్యాటింగ్ ఎంచుకుని 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 రన్లు సాధించింది. లక్ష్యం 171 రన్లతో బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 17 ఓవర్లలో 106 రన్లకు ఆలౌట్ అయి 64 రన్ల తేడాతో ఓడిపోయింది. ఇది టోర్నమెంట్‌లో భారత్‌కు గొప్ప ప్రారంభం.

మ్యాచ్ ప్రారంభంలోనే భారత ఓపెనర్లు షాఫాలీ వర్మ త్వరగా అవుట్ అయినా, జెమిమా రోడ్రిగ్స్ వికెట్లు కోల్పోయినా, స్మృతి మంధన రాణించింది. ఆమె 44 బాల్స్‌లో 68 రన్లు (9 ఫోర్లు, 2 సిక్సులు) సాధించి జట్టును ఆదుకుంది. ఇది పాకిస్తాన్‌పై ఆమె అత్యుత్తమ టీ20 వరల్డ్ కప్ స్కోర్ అని రిపోర్టులు చెబుతున్నాయి. హర్మన్‌ప్రీత్ కౌర్, భార్తి ఫుల్మాలి కూడా మంచి సహకారం అందించారు. చివరి దశలో రిచా ఘోష్ 17 బాల్స్‌లో 34 రన్లు (అవుట్ కాని) కొట్టి స్కోరును 170కి చేర్చింది. పాకిస్తాన్ బౌలింగ్‌లో ఫాతిమా సనా 2/33 సాధించింది. ఛేజింగ్‌లో పాకిస్తాన్ ప్రారంభం బలహీనంగా ఉంది. మునీబా అలీ 41 రన్లు సాధించినా, ఇతర బ్యాట్స్‌మెన్ ఒక్కరూ స్థిరపడలేదు. భారత స్పిన్నర్లు దేవి శర్మ, శ్రీ చరణి రాణించారు. దేవి శర్మ 5/10 (4 ఓవర్లు) తీసి మ్యాచ్‌ను తన ఆధీనంలోకి తెచ్చింది. ఇది ఆమె అంతర్జాతీయ వికెట్ల సంఖ్యను మరింత పెంచింది. శ్రీ చరణి 3/20 సాధించి భారత బౌలింగ్ బలాన్ని చాటించింది. పాకిస్తాన్ 91/7 వద్ద కుంచించుకుపోయి చివరికి 106కి ఆలౌట్ అయింది. ఇది భారత్‌కు సమగ్ర విజయం. ఈ విజయం భారత మహిళా క్రికెట్ చరిత్రలో మైలురాయి. హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలో జట్టు గతంలో ఇంగ్లాండ్, వెస్టిండీస్‌తో వార్మప్ మ్యాచ్‌లలో మంచి ఫామ్ చూపించింది. భారత్ పాకిస్తాన్‌పై టీ20లలో ఆధిపత్యం కొనసాగిస్తోంది. ఈ మ్యాచ్ రైవల్రీని మరింత ఉత్తేజపరిచింది. రోహిత్ శర్మ, బాబర్ అజం వంటి స్టార్ ప్లేయర్లు వీడియో మెసేజ్‌ల ద్వారా మద్దతు తెలిపారు. ఎడ్జ్‌బాస్టన్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటంతో భారత్ సరైన నిర్ణయం తీసుకుంది. ఈ గెలుపు టోర్నమెంట్‌లో భారత్‌ను బలమైన ఆవకాశాలతో ముందుకు నడిపిస్తుంది. మహిళా క్రికెట్‌లో భారత్ మొదటి టీ20 వరల్డ్ కప్ టైటిల్ లక్ష్యంగా ఉంది. గతంలో ఫైనల్స్‌లో చేరినా టైటిల్ సాధించలేదు. ఈ విజయం ఆత్మవిశ్వాసం పెంచుతుంది. పాకిస్తాన్ జట్టు ఫాతిమా సనా నాయకత్వంలో మంచి ప్రదర్శన ఇవ్వాలని ప్రయత్నించింది కానీ బ్యాటింగ్ బలహీనత కారణంగా ఓటమి ఎదుర్కొంది.ఈ మ్యాచ్ క్రికెట్ ప్రపంచాన్ని ఆకట్టుకుంది. మహిళా క్రికెట్ అభివృద్ధికి ఇలాంటి రైవల్రీలు కీలకం. భారత అభిమానులు ఈ విజయాన్ని జరుపుకుంటున్నారు. టోర్నమెంట్ మరిన్ని ఉత్తేజకరమైన మ్యాచ్‌లతో కొనసాగుతుంది. భారత్ తర్వాతి మ్యాచ్‌లలో కూడా ఇలాంటి ప్రదర్శన ఇవ్వాలని అందరూ ఆశిస్తున్నారు.


# మా జట్టు బ్యాటింగ్ ప్రదర్శన తీవ్రంగా నిరాశపరిచింది

## పాకిస్తాన్ కెప్టెన్ ఫాతిమా సనా తీవ్ర నిరాశ

ఐసీసీ మహిళల టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా చిరకాల ప్రత్యర్థి భారత్‌తో జరిగిన హై–వోల్టేజ్ మ్యాచ్‌లో 64 పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూడటంపో పాకిస్తాన్ కెప్టెన్ ఫాతిమా సనా తీవ్ర నిరాశను వ్యక్తం చేసింది. మ్యాచ్ ముగిసిన తర్వాత ఆమె మాట్లాడుతూ.. ముఖ్యంగా తన జట్టు బ్యాటింగ్ ప్రదర్శన తీవ్రంగా నిరాశపరిచిందని ఆమె అంగీకరించింది. ప్రపంచ కప్‌లో తమకు ఇంకా సుదీర్ఘ ప్రయాణం ఉందని.. రాబోయే మ్యాచుల్లో బ్యాటర్లు ఖచ్చితంగా బాధ్యతాయుతంగా ఆడి రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఫాతిమా సనా స్పష్టం చేసింది. ఫీల్డింగ్ తప్పిదాలు, ఆఖరి ఓవర్ల విధ్వంసమే కొంపముంచింది! మ్యాచ్‌లో తమ వ్యూహాలు ఎక్కడ దెబ్బతిన్నాయనే విషయాన్ని పాక్ కెప్టెన్ విశ్లేషించింది. "ఇన్నింగ్స్ మొదటి 15 ఓవర్ల వరకు మా బౌలింగ్, ఫీల్డింగ్ ప్రణాళికాబద్ధంగా బాగానే సాగాయి. కానీ ఆ తర్వాత చివరి ఓవర్లలో మేము చాలా అదనపు పరుగులు ఇచ్చేశాం. ఒక దశలో స్లో ఓవర్ రేట్ పెనాల్టీ కారణంగా ఒక ఫీల్డర్‌ను లోపలికి తీసుకురావాల్సి వచ్చింది, అది మాకు భారీ నష్టాన్ని చేకూర్చింది.



రాబోయే మ్యాచ్‌లలో ఇలాంటి పొరపాట్లు జరగకుండా మెరుగుపరుచుకుంటాం" అని ఫాతిమా సనా చెప్పుకొచ్చింది. స్లో ఓవర్ రేట్ పెనాల్టీ పడటానికి భారత బ్యాటర్ల లెఫ్ట్–రైట్ కాంబినేషన్ ఒక కారణం కావచ్చని, తమ జట్టులో ఎక్కువ మంది యువ ఆటగాళ్లు ఉన్నందున ఇలాంటి క్లిష్ట పరిస్థితుల నుంచి వారు అనుభవాన్ని గడిస్తున్నారని ఆమె పేర్కొంది. క్రికెట్‌లో ఫీల్డింగ్ ప్రాధాన్యతను గుర్తుచేస్తూ ఫాతిమా సనా తమ జట్టు ఫీల్డర్లపై అసహనం వ్యక్తం చేశారు. "క్యాచ్‌లు విడిచిపెడితే మ్యాచ్‌లు గెలవడం అసాధ్యం. దురదృష్టవశాత్తూ ఈ మ్యాచ్‌లో మేము చాలా ముఖ్యమైన క్యాచ్‌లను చేజార్చాం, ముఖ్యంగా సీనియర్ ఆటగాళ్లే ఇలాంటి తప్పులు చేయడం విచారకరం. ఫీల్డింగ్‌లో జరిగే చిన్న చిన్న పొరపాట్లు మొత్తం మ్యాచ్ ఫలితాన్నే మార్చేస్తాయి. కాబట్టి తదుపరి మ్యాచ్ నాటికి మేము బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్‌ను కూడా ఖచ్చితంగా మెరుగుపరుచుకోవాలి" అని ఫాతిమా సనా హెచ్చరించింది. మ్యాచ్‌లో భిన్నంగా ఏమైనా చేయగలిగేవారా అనే ప్రశ్నకు సమాధానమిస్తూ.. తాము ముందే అనుకున్న ప్రణాళికలను మైదానంలో అమలు చేయడానికే ప్రయత్నించామని కెప్టెన్ పేర్కొంది. పవర్‌ప్లేలో బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ తాము సానుకూల దృక్పథంతో ఆడి పైచేయి సాధించామని, కానీ ఆ తర్వాత మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్ లైనప్ పూర్తిగా కుప్పకూలిపోవడం కోలుకోలేని దెబ్బ తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మెరుగైన ఫలితాలు సాధించాలంటే తమ బ్యాటింగ్ విభాగం మరింత బలంగా పుంజుకోవాలని ఫాతిమా సనా ముగించింది.




# సంచలనం సృష్టించిన తేజస్ శిర్సే..

తేజస్ శిర్సే ఈ రేసును కేవలం 13.27 సెకన్లలోనే పూర్తి చేసిన తేజస్.. గతంలో తన పేరిట ఉన్న 13.41 సెకన్ల రికార్డును మరింత మెరుగుపరుచుకున్నాడు. ఇదే రేసులో రిలయన్స్‌కే చెందిన మరో అథ్లెట్ క్రిషిక్ మంజునాథ్ రెండో స్థానంలో నిలిచాడు. ఈ అద్భుత టైమింగ్‌తో గ్లాస్గోలో జరగబోయే ప్రతిష్ఠాత్మక కామన్వెల్త్ గేమ్స్ అర్హత ప్రమాణాన్ని (13.39 సెకన్లు) తేజస్ సులువుగా దాటేశాడు. కాగా, ఈ ఏడాది ఆసియా అథ్లెట్లలో పురుషుల 110 మీటర్ల హర్డిల్స్‌లో తేజస్ నమోదు చేసిన టైమింగ్ ఆరో అత్యంత వేగవంతమైనది కావడం విశేషం. ఈ అద్భుత విజయంపై 24 ఏళ్ల తేజస్ స్పందిస్తూ.. "ఇంతకుముందు రాంచీ, తైవాన్‌లలో పోడియం సాధించినప్పటికీ.. చాలా తృప్తిలో కామన్వెల్త్ గేమ్స్ అర్హత మార్క్‌ను కోల్పోయాను. అందుకే ఈరోజు నా మైండ్‌సెట్ మార్చుకున్నా. దీన్ని ఒక 'ఫ్రీ హిట్' లాగా భావించాను. పర్‌ఫెక్ట్ షాట్ కోసం చూడకుండా.. బంతిని గాల్లోకి బాదడం లేదా అవుట్ అవ్వడం.. అంతే అనుకున్నా. ఎలాంటి ఒత్తిడి లేకుండా, కేవలం ట్రైనింగ్ లాగే భావించి పరుగెత్తాను. నా రికవరీ, శిక్షణకు ఎంతగానో సహకరించిన రిలయన్స్ ఫౌండేషన్ టీమ్‌కు ఈ ఘనత దక్కుతుంది" అని అన్నాడు. గత ఏడాది పురుషుల 110 మీటర్ల హర్డిల్స్‌లో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించిన రెండో భారతీయుడిగా తేజస్ రికార్డు సృష్టించాడు. లయన్స్ ఫౌండేషన్ అథ్లెటిక్స్ డైరెక్టర్, కోచ్ జేమ్స్ హిలియర్ తేజస్ పట్టుదలను అభినందిస్తూ.. "తేజస్ ప్రదర్శన పట్ల నేను చాలా సంతోషంగా ఉన్నాను. గత కొన్ని వారాలుగా అతను పడుతున్న శ్రమకు తగ్గ ఫలితం ఇది. ఈ ఏడాది ప్రారంభంలో అతనికి గాయమైనప్పటికీ.. చాలా బలంగా పునరాగమనం చేశాడు. రిలయన్స్ బృందం అతనిని మళ్లీ ఫామ్‌లోకి తీసుకురావడానికి ఎంతో శ్రమించింది. ఇదే నిలకడను అతను ఈ ఏడాది జరగబోయే ప్రధాన టోర్నమెంట్‌లలోనూ కొనసాగిస్తాడని ఆశిస్తున్నాను" అని తెలిపారు.లయన్స్ ఫౌండేషన్ అథ్లెటిక్స్ ప్రోగ్రామ్ ద్వారా ఎంతో లబ్ధి పొందిన తేజస్.. గత రెండేళ్లలో ఇండోర్, అవుట్‌డోర్ జాతీయ రికార్డులను పలుమార్లు బద్దలు కొట్టాడు. సరికొత్త జాతీయ రికార్డుతో జోరు మీదున్న తేజస్.. ఈ నెల చివర్లో భువనేశ్వర్‌లో జరగనున్న 'ఇంటర్-స్టేట్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్'లోనూ రాణించి, కామన్వెల్త్ గేమ్స్ భారత జట్టులో తన స్థానాన్ని ఖాయం చేసుకోవాలని పట్టుదలతో ఉన్నాడు.



# జై హనుమాన్.. అంతా ఆయన దయ వల్లే

## టీమిండియా స్టార్ స్పిన్నర్ దీప్తి శర్మ

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్ 2026లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ జట్టుపై టీమిండియా 64 పరుగుల తేడాతో ఘన విజయం సాధించడంలో స్టార్ స్పిన్నర్ దీప్తి శర్మ అత్యంత కీలక పాత్ర పోషించింది. తన అద్భుతమైన మాయాజాలంతో కేవలం 10 పరుగులకే 5 వికెట్లు పడగొట్టి పాక్ నడ్డి విరిచిన దీప్తి శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'అవార్డు దక్కింది. ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్న అనంతరం దీప్తి మాట్లాడుతూ తన సంతోషాన్ని పంచుకుంది. ఈ విజయం పట్ల తాను ఎంతో కృతజ్ఞతతో ఉన్నానని, ఇలాంటి స్పిన్‌కు అనుకూలించే వికెట్లపై బౌలింగ్ చేయడం తనకు చాలా ఇష్టమని పేర్కొంది. ఈ ఘనత సాధించిన క్రమంలో ఆమె భక్తిపూర్వకంగా "హనుమాన్ జీ గొప్పవాడు" అంటూ హనుమంతుడిని స్మరించుకోవడం విశేషం. ఎడ్జ్‌బాస్టన్ పిచ్ పై పాకిస్థాన్ బ్యాటర్లను కట్టడి చేసిన వ్యూహాన్ని దీప్తి శర్మ వివరించింది. "పిచ్‌పై బంతి బాగా టర్న్ అవుతోంది. అందుకే నేను ప్రతి బంతికి, ప్రతి ఓవర్‌కు నా బౌలింగ్ వేగాన్నిమారుస్తూ వచ్చాను. ఆ వ్యూహం నాకు చాలా బాగా ఉపయోగపడింది. బంతి తిరుగుతున్నప్పుడు గాల్లో కాస్త నెమ్మదిగా వేయాలని నిర్ణయించుకున్నాను. నాపై నాకు నమ్మకంతో, సరైన లైన్ అండ్ లెంగ్త్‌లో బంతులు విసరడం పైనే పూర్తిగా దృష్టి పెట్టాను" అని దీప్తి వెల్లడించింది. గత కొన్ని మ్యాచ్‌లుగా వికెట్లు దక్కకపోవడంపై స్పందిస్తూ.. తాను ఎప్పుడూ వికెట్ల గురించి ఆందోళన చెందలేదని, సరైన సమయం వచ్చినప్పుడు జట్టు కోసం ఖచ్చితంగా రాణిస్తాననే నమ్మకం తనపై తనకు ఎప్పుడూ ఉందని స్పష్టం చేశారు. బౌలింగ్‌లో తాను అదరగొట్టినప్పటికీ.. మ్యాచ్‌లో భారత జట్టుకు అసలైన ఊపు తెచ్చింది మాత్రం బ్యాటర్లేనని దీప్తి శర్మ కొనియాడారు. "ముఖ్యంగా ఓపెనర్ స్మృతి మంధాన, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ల మధ్య నెలకొన్న 91 పరుగుల భారీ భాగస్వామ్యం గురించి నేను ప్రత్యేకంగా చెప్పాలి. ఆ క్లిష్ట సమయంలో వారిద్దరూ ఆడిన ఇన్నింగ్స్ వల్లే మ్యాచ్ మొత్తం మన వైపు తిరిగింది. అక్కడి నుంచే జట్టుకు అసలైన మొమెంటం లభించింది" అని దీప్తి ప్రశంసించారు.తనకు ఐసీసీ టోర్నమెంట్లు ఆడటం అంటే ఎంతో ఇష్టమని.. తన అంతర్జాతీయ కెరీర్ ప్రయాణం కూడా ఐసీసీ ఈవెంట్ నుంచే మొదలైందని దీప్తి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఇంగ్లాండ్‌లో ఆడిన అనుభవం గురించి చెబుతూ.. బర్మింగ్‌హామ్ మైదానంలో లభించిన ప్రేక్షకుల మద్దతును ఆమె ప్రత్యేకంగా అభినందించారు. "ఇక్కడికి ఇంత పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చి భారత జట్టుకు మద్దతు తెలపడం నిజంగా అద్భుతంగా అనిపించింది. ప్రతి మ్యాచ్‌లోనూ మాకు ఇలాంటి మద్దతే కావాలి.

# రనౌట్ వివాదంపై క్లారిటీ ఇచ్చిన కెప్టెన్ గిల్

ఆఫ్ఘనిస్తాన్‌తో ధర్మశాల వేదికగా జరిగిన వన్డే మ్యాచ్ లో భారత జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించినప్పటికీ.. మ్యాచ్ ముగిసిన అనంతరం అందరి దృష్టి రోహిత్ శర్మ రనౌట్ అంశంపైనే నిలిచిది. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ దురదృష్టవశాత్తూ రనౌట్ రూపంలో పెవిలియన్ చేరాల్సి వచ్చిన సంగతి తెలిసిందే. ఇద్దరు ఆటగాళ్ల మధ్య జరిగిన చిన్నపాటి పొరపాటు వల్ల రోహిత్ శర్మ వికెట్ కోల్పోవాల్సి వచ్చింది. అయితే మ్యాచ్ అనంతరం టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ రనౌట్ వివాదంపై నవ్వుతూ స్పందించి డ్రెస్సింగ్ రూమ్ వాతావరణాన్ని తేలికపరిచాడు.భారత్ ఇన్నింగ్స్ 6వ ఓవర్లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆఫ్ఘన్ యువ స్పిన్నర్ అల్లా ఘజన్‌ఫర్ వేసిన బంతిని రోహిత్ శర్మ మిడ్ వికెట్ వైపు ఆడి వేగంగా సింగిల్ తీసేందుకు పరిగెత్తాడు. నాన్‌స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్ కూడా మొదట రన్ తీసేందుకు ముందుకు వచ్చాడు. కానీ కొన్ని అడుగులు వేసిన తర్వాత అకస్మాత్తుగా వద్దంటూ రోహిత్ శర్మను వెనక్కి పంపేశాడు. అప్పటికే రోహిత్ శర్మ క్రీజు దాటి చాలా మందుకు వచ్చేయడంతో ఆఫ్ఘన్ కెప్టెన్ రషీద్ ఖాన్ ఇచ్చిన త్రోను అందుకున్న వికెట్ కీపర్ బెయిల్స్ ఎగరగొట్టాడు. దీంతో రోహిత్ శర్మ 16 పరుగుల వద్ద తీవ్ర



నిరాశతో పెవిలియన్ చేరాడు. పోస్ట్ మ్యాచ్ ప్రజెంటేషన్‌లో శుభ్‌మన్ గిల్‌ను ఈ రనౌట్ గురించి ప్రశ్నించగా.. గిల్ నవ్వుతూ సమాధానమిచ్చాడు. "రోహిత్ భాయ్ అప్పటికే డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లి రనౌట్ రీప్లే చూసేశాడని నాకు తెలుసు. నేను ఆయనతో మాట్లాడినప్పుడు.. 'ఏం పర్లేదు, అంతా బానే ఉంది' అని రోహిత్ చెప్పాడు. అయినా అఫ్ఘానిస్థాన్‌తో ఆడిన గత టీ20 మ్యాచ్‌లో కూడా ఆయన ఇలాగే రనౌట్ అయ్యాడు కదా" అంటూ శుభ్‌మన్ గిల్ సరదాగా కామెంట్ చేశాడు. గిల్ ఇచ్చిన ఈ సమాధానంతో డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ విషయమై ఎలాంటి గొడవలు లేవని, అంతా సవ్యంగానే ఉందని స్పష్టమైంది. వర్షం కారణంగా 25 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్ లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ 194 పరుగులు చేసింది. ఆ జట్టు ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ కేవలం 51 బంతుల్లోనే 102 పరుగులతో వీరవిహారం చేశాడు. ఒకానొక దశలో మ్యాచ్ భారత్ చేతుల్లోంచి చేజారిపోతుందనిపించినా.. భారత బౌలర్లు పునరాగమనం చేశారు. అనంతరం అనంతరం 195 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(84★) ఆడిన ఇన్నింగ్స్ సాయంతో 13 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. గిల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ మ్యాచ్ ద్వారా వన్డేల్లోకి అరంగేట్రం చేసిన యువ బౌలర్లు గుర్నూర్ బ్రార్, హర్ష దూబే చెరో 3 వికెట్లు తీసి అఫ్ఘానిస్థాన్‌ను కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించారు.

# మిథాలీ రికార్డును బద్దలు కొట్టిన హర్మన్‌ప్రీత్

బర్మింగ్‌హామ్ వేదికగా ఆదివారం పాకిస్తాన్‌తో జరుగుతున్న ఐసీసీ ఉమెన్స్ టి20 వరల్డ్ కప్ గ్రూప్–ఎ మ్యాచ్‌లో టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (36) అరుదైన మైలురాయిని చేరుకుంది. ఉమెన్స్ టి20 వరల్డ్ కప్ హిస్టరీలో ఇండియా తరపున అత్యధిక రన్స్ చేసిన ప్లేయర్‌గా లెజెండరీ క్రికెటర్ మిథాలీ రాజ్‌ను హర్మన్ అధిగమించింది. మ్యాచ్ స్టార్ట్ అవ్వడానికి ముందు మిథాలీ, హర్మన్ ఇద్దరూ 726 రన్స్‌తో సమానంగా ఉండగా, క్రీజులోకి వచ్చిన ఫస్ట్ బంతికే సింగిల్ తీసిన హర్మన్‌ప్రీత్ ఈ రికార్డును తన పేరిట లిఖించుకుంది. దాయాది జట్టుపై ఈ ఫీట్ సాధించడం ఫ్యాన్స్‌కు డబుల్ కిక్ ఇచ్చింది.టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇండియాకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బలు తగిలాయి. ఓపెనర్ షఫాలీ వర్మ కేవలం 6 రన్స్ చేసి సాదియా ఇక్బాల్ బౌలింగ్‌లో అవుట్ అయింది. ఆ తర్వాత వచ్చిన జెమిమా రోడ్రిగ్స్ (1) కూడా తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరింది. టీమ్ స్కోరు 18 రన్స్‌కే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న టైమ్‌లో వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (44 బంతుల్లో 68, 9 ఫోర్లు, 2 సిక్సర్లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. వీరిద్దరూ మూడో వికెట్‌కు 91 రన్స్ విలువైన పార్టనర్‌షిప్‌ను నెలకొల్పి పాకిస్తాన్ బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టారు. 10 ఓవర్లు ముగిసేసరికి ఇండియా 65/2 తో పటిష్ట స్థితిలో నిలిచింది. లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ స్మృతి మంధాన తన క్లాస్ బ్యాటింగ్‌తో స్టేడియంను హోరెత్తించింది. 44 బంతుల్లోనే 9 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన మంధాన, మొత్తం 68 రన్స్ చేసి అవుట్ అయింది. ఇన్నింగ్స్ మధ్యలో అలియా రియాజ్ క్యాచ్ డ్రాప్ చేయడంతో లభించిన లైఫ్‌ను స్మృతి అద్భుతంగా వాడుకుంది. అయితే ఆఫ్ స్పిన్నర్



రామీన్ షమీమ్ వేసిన బంతికి స్మృతి భారీ షాట్ ఆడబోయి వికెట్ సమర్పించుకుంది. మంధాన అవుట్ అయినా ఒకవైపు హర్మన్‌ప్రీత్ కౌర్ బాధ్యతాయుతంగా ఆడుతూ స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లింది. ఇన్నింగ్స్ 15వ ఓవర్లో ఇండియాకు మరో షాక్ తగిలింది. సాదియా ఇక్బాల్ బౌలింగ్‌లో భారతి ఫుల్మాలి (1) స్టంపౌట్ అయింది. ఆ తర్వాత క్రీజులో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు తోడుగా యంగ్ సెన్సేషన్ రిచా ఘోష్ (17 బంతుల్లో 34, 5 ఫోర్లు, 1 సిక్సర్) నిలిచింది. ఆ తర్వాత హర్మన్ ఔటైనా, తను వేగంగా ఆడటంతో భారత్ మెరుగైన స్కోరు సాధించింది. ఇక నిర్ణీత 20 ఓవర్లలో భారత్ 6 వికెట్లకు 170 పరుగుల స్కోరు సాధించింది. పాక్ బౌలర్లలో సనా ఫాతిమా, సాదియా ఇక్బాల్ చెరో రెండు వికెట్లతో రాణించారు.

# అనంత పద్మనాభ స్వామి వారి రథయాత్ర మన సంస్కృతి, మూలాలను నెక్స్ట్ జనరేషన్‌కు పరిచయం చేయడానికి చేస్తున్న ఒక ప్రయత్నం

## స్వామివారి ఆశీస్సులతో నాగబంధం ఘన విజయం సాధిస్తుందని నమ్ముతున్నాం: డైరెక్టర్ అభిషేక్ నామా

విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం – ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సాహ్నీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ సినిమా కథలోని ట్రెజర్ హంట్ కాన్సెప్ట్‌కు అనుగుణంగా ఈ ప్రచార యాత్రను రూపొందించారు. ఈ రోజు అనంత పద్మనాభ స్వామి వారి రథ యాత్రని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్వామి వారి రథయాత్ర ఈవెంట్‌లో డైరెక్టర్ అభిషేక్ నామా మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఇంత వర్షంలో కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ థాంక్స్. ఇది కేవలం సినిమా ప్రమోషన్స్ మాత్రమే కాదు, మన సంస్కృతి, మన మూలాలను నెక్స్ట్ జనరేషన్‌కు పరిచయం చేయడానికి చేస్తున్న ఒక ప్రయత్నం. ఇది మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను. ఇందుకు మీ అందరి సపోర్ట్ కావాలి. ఇంత పెద్ద విజన్‌ను సపోర్ట్ చేసిన నిశిత గారికి, కిషోర్ గారికి ధన్యవాదాలు. విరాట్‌ను చాలా కష్టపెట్టాను. తీవ్ర జ్వరంలో కూడా అతను ఈ సినిమా కోసం ఎంతో కష్టపడి పనిచేశాడు. ఈ సినిమా తర్వాత విరాట్ అంటే ఏంటో అందరికీ తెలుస్తుంది. మా టీమ్ అందరికీ థాంక్యూ. జునైద్, అభి అద్భుతమైన సంగీతాన్ని అందించారు. వారి మ్యూజిక్ మీ అందరికీ నచ్చుతుంది. ఈ రథయాత్రను విజయవంతం చేయాలని కోరుకుంటున్నాను. ఓం నమో నారాయణాయ. హీరో విరాట్ కర్ణ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. అనంత పద్మనాభ స్వామి వారి రథయాత్రలో పాల్గొన్నందుకు అందరికీ ధన్యవాదాలు. నాగబంధం ఎంతో కష్టపడి చేసిన సినిమా. రెండేళ్ల పాటు శ్రమించి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. జూలై 3న మీరందరూ థియేటర్లకు వెళ్లి మా చిత్రాన్ని ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను. అనంత పద్మనాభ స్వామి వారి రథయాత్రలో భాగంగా మేము అనేక నగరాలను సందర్శించబోతున్నాం. ఈ కార్యక్రమాన్ని ఇంత విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు. మా దర్శకుడు అభిషేక్ నామా గారు తన డ్రీమ్ ప్రాజెక్ట్‌లో నన్ను భాగం చేసినందుకు చాలా ఆనందంగా ఉంది. వారికి ప్రత్యేక ధన్యవాదాలు. మా నిర్మాతలు నిశిత గారు, కిషోర్ గారు భారీ బడ్జెట్‌తో ఎంతో ధైర్యంగా ఈ సినిమాను నిర్మించారు. అందరం జూలై 3న థియేటర్లలో కలుద్దాం. హీరోయిన్ నభా నటేష్ మాట్లాడుతూ.. ఓం నమో నారాయణాయ. అందరికీ నమస్కారం. స్వామి వారి రథయాత్రను ఈరోజు ప్రారంభిస్తున్నాము. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ఈ రథయాత్ర జరగబోతోంది. మీడియాకు, ప్రేక్షకులకు ధన్యవాదాలు. నాగబంధంకు సంబంధించిన ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కు అద్భుతమైన స్పందన లభించింది. జూలై 3న సినిమా విడుదల కానుంది. అందరూ థియేటర్లలో చూసి ఆదరిస్తారని ఆశిస్తున్నాను. నాకు ఇంత అద్భుతమైన అవకాశం ఇచ్చిన అభిషేక్ గారికి, మా నిర్మాతలకు, మా హీరో విరాట్‌కు ధన్యవాదాలు. విరాట్ అద్భుతంగా నటించారు. తప్పకుండా అందరూ థియేటర్లలో సినిమా చూడాలని కోరుకుంటున్నాను.



ప్రొడ్యూసర్ నిశిత నాగిరెడ్డి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. మేము విడుదల చేసిన ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది.

ఇంత ప్రేమగా ఆదరించిన ప్రేక్షకులకు హృదయపూర్వక ధన్యవాదాలు. ఇకముందు కూడా మా ప్రమోషనల్ కార్యక్రమాలను ఇలాగే ఆదరిస్తారని ఆశిస్తున్నాము.

కర్నూలు నుంచి హైదరాబాద్ వరకు ఈ రథయాత్ర కొనసాగుతుంది. ప్రతి ఒక్కరూ ఈ రథోత్సవంలో పాల్గొని స్వామి వారి ఆశీర్వాదాలు పొందాలని కోరుకుంటున్నాము. ప్రొడ్యూసర్ కిషోర్ అన్నపురెడ్డి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ వేడుకకు విచ్చేసిన అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. అనంత పద్మనాభ స్వామి యాత్ర ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో నిర్వహిస్తున్నాము. స్వామి వారి ఆశీస్సులు మా మీద ఉన్నాయని నమ్ముతున్నాము. తప్పకుండా స్వామి వారి ఆశీస్సులతో నాగబంధం ఘన విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాము. ఈ వేడుక చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# ది దేవరకొండ ఫౌండేషన్ ద్వారా ప్రతిభ గల పేద విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందజేసిన హీరో విజయ్ దేవరకొండ

హీరో విజయ్ దేవరకొండ తన సొంతూరికి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. రశ్మిక మందన్నతో వివాహం అనంతరం తన సొంతూరు నాగర్ కర్నూలు జిల్లాలోని బల్మూరు మండలంలో ఉన్న తుమ్మన్ పేటకు సతీసమేతంగా వెళ్లిన విజయ్ అక్కడ రిసెప్షన్ జరుపుకున్నారు. అదే సందర్భంలో అచ్చంపేట డివిజన్ లో ఉన్న 45 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 9, 10వ తరగతి మెరిట్ విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందిస్తామని ప్రకటించారు. ఆ మాటను నిలబెట్టుకుంటూ ఈ రోజు అచ్చంపేట డివిజన్ లోని 9, 10వ తరగతిలో ప్రతిభ కనబర్చి ఫస్ట్, సెకండ్ ర్యాంక్స్ సాధించిన 180 మంది పేద మెరిట్ విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రశ్మిక మందన్న, విజయ్ దేవరకొండ మాతృమూర్తి మాధవి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, జిల్లా విద్యాధికారి రమేష్, ఇతర విద్యాశాఖ అధికారులు, స్థానిక నాయకులు, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, టీచర్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ – జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా విజయ్ దేవరకొండ తన సొంత ఊరును మర్చిపోలేదు. అది ఆయన గొప్ప వ్యక్తిత్వానికి నిదర్శనం. ఆయన పేరెంట్స్ గోవర్థన్ , మాధవి గారు కూడా సొంతూరును ఎంతో ప్రేమిస్తారు. విజయ్ మన అచ్చంపేట వాసి కావడం మనందరికీ గర్వకారణం. ఆయన ఇండస్ట్రీలో ఇంకా గొప్ప స్థాయికి వెళ్లాలని కోరుకుంటున్నా. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారంతా పేద విద్యార్థులే. వారికి ది దేవరకొండ ఫౌండేషన్ ద్వారా స్కాలర్ షిప్స్ ఇవ్వడం అభినందనీయం. పిల్లల విద్య కోసం ఎంత చేసినా తక్కువే. ఏటా ఈ కార్యక్రమంలే చేస్తామని విజయ్ చెప్పడం సంతోషంగా ఉంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రశ్మిక గారికి నా అభినందనలు తెలియజేస్తున్నా. ఈ విద్యార్థినీ విద్యార్థులంతా జీవితంలో గొప్ప స్థాయికి వెళ్లాలి. అన్నారు. హీరోయిన్ రశ్మిక మందన్న మాట్లాడుతూ – ది దేవరకొండ ఫౌండేషన్ తరుపున పేద మెరిట్ స్టూడెంట్స్ కు స్కాలర్ షిప్స్ ఇవ్వాలని అనుకున్నప్పుడు ఫస్ట్ మామయ్య పుట్టినఊరు తుమ్మన్ పేట్, అచ్చంపేటలోనే చేయాలని అనుకున్నాం. ఇక్కడ ఇంతమంది స్టూడెంట్స్ ను చూస్తుంటే హ్యాపీగా ఉంది. నేను మీ క్లాస్ చదివేప్పుడు మీఅంత మెరిట్ స్టూడెంట్ ని కాదు. చదువులో నన్ను మీరు దాటేశారు. ఎంతో కష్టపడి చదివి ఫస్ట్, సెకండ్ ర్యాంక్స్ తెచ్చుకుని మీ పేరెంట్స్, టీచర్స్ గర్వపడేలా చేశారు. జీవితంలో ఒక్కోసారి మార్కులు తక్కువ రావొచ్చు, ఎక్కువ రావొచ్చు కానీ జీవితంలో ఫోకస్, క్రమశిక్షణ చాలా ముఖ్యం. అవి ఉంటే ఏ రంగంలో అయినా గొప్ప స్థాయికి వెళ్తాం. నేను, రశ్మిక స్టూడెంట్ లైఫ్ లో ర్యాంకర్స్ కాదు. మీ విజయాన్ని సెలబ్రేట్ చేయడానికి మేమంతా ఇక్కడికి వచ్చాం. ఈసారి రిజల్ట్స్ లో నాగర్ కర్నూల్ జిల్లా తెలంగాణలో సెకండ్ ప్లేస్ లో నిలిచిందని డీయీవో రమేష్ గారు చెప్పడం హ్యాపీగా ఉంది. నాగర్ కర్నూలు టీచర్స్ అందరికీ ఈ క్రెడిట్ దక్కుతుంది. పిల్లల జీవితాల్లో టీచర్స్, తల్లిదండ్రుల పాత్ర చాలా గొప్పది. పేరెంట్స్ ఎలా ప్రవర్తిస్తే పిల్లలు అలా నేర్చుకుంటారు. మీరు గొప్ప వ్యాల్యూస్ నేర్పిస్తే వాళ్లు గొప్పగా ఎదుగుతారు. నేను ఇవాళ ఈ స్థాయిలో ఉన్నానంటే పుట్టపర్తి స్కూల్లోని మంచి వాతావరణం. మా ఇంట్లో పేరెంట్స్ నేర్పించిన మంచి నడవడికే కారణం. మా నాన్న అమ్మ ఈ ఊరితో పెంచుకున్న అనుబంధం వల్లే నేను ఈ రోజు ఈ ఛారిటీ కార్యక్రమం చేయగలుగుతున్నా. మీ అందరి జీవితాల్లో నేనూ ఒక ముఖ్య భాగం కావాలనే ఈ స్కాలర్ షిప్స్ కార్యక్రమం చేస్తున్నాం.



కొన్నిసార్లు గెలుస్తాం, మరికొన్నిసార్లు ఓడిపోతాం.

కానీ ఎప్పుడూ నేర్చుకుంటూనే ఉంటాం. మీరు మీ టీచర్స్ నుండి నేర్చుకోండి, మీ పేరెంట్స్ కు రెస్పెక్ట్ ఇవ్వండి. మీ జీవితాల్లో గొప్పవాళ్లుగా ఎదగండి.

విజయ్ మాతృమూర్తి మాధవి మాట్లాడుతూ – మాకు సొంత ఊరి మీద ప్రేమతో పాటు పిల్లల మీద ఉన్న ప్రేమతో ఈ మంచి కార్యక్రమం చేపట్టాం. పిల్లలకు ఫీజులు చెల్లించడం ఎంత కష్టమో మాకు తెలుసు. పిల్లలు తమ తల్లిదండ్రులు ఎంత కష్టపడి చదివిస్తున్నారో తెలుసుకోవాలి. అలాగే పిల్లల కలల్ని నిజం చేసేలా తల్లిదండ్రులు ప్రయత్నించాలి. కష్టపడితే జీవితంలో తప్పకుండా ఫలితం ఉంటుంది. పిల్లలు మీరంతా డ్యూటీ, డిసిప్లెయిన్, డివోషన్, డెడికేషన్, డిటెర్మినేషన్...ఈ ఐదు డి లు మన జీవితంలో పాటించాలి. జీవితంలో గొప్ప వాళ్లుగా ఎదగాలని కోరుకుంటున్నా. అన్నారు. హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ – 9,10వ తరగతిలో ఫస్ట్, సెకండ్ ర్యాంక్స్ సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు నా అభినందనలు. మీ విజయాన్ని సెలబ్రేట్ చేసుకునేందుకు, పురస్కరించుకునేందుకు ఈ కార్యక్రమం చేస్తున్నాం. ఎమ్మెల్యే వంశీకృష్ణగారు, జిల్లా విద్యాశాఖాధికారుల సహకారం వల్లే ఈ కార్యక్రమం సక్సెస్ ఫుల్ గా చేయగలుగుతున్నాం. మీరు ఎక్కువ మార్కులు తెచ్చుకోవడం కంటే ఆ మార్కులు సాధించేందుకు పడిన శ్రమ, పెట్టిన ఏకాగ్రత చాలా గొప్పవి. మీరు ఫోకస్ గా, డిసిప్లిన్ గా ఉండి ప్రయత్నించడం వల్లే ఫస్ట్, సెకండ్ ర్యాంక్స్ సాధించగలిగారు.

ఇప్పుడు అచ్చంపేటలో స్టార్ట్ చేశాం, నెక్స్ట్ నాగర్ కర్నూల్ లో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఆ తర్వాత తెలంగాణ వ్యాప్తంగా పేద మెరిట్ విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందించాలని అనుకుంటున్నాం. ఇది మా కల. ఈ కార్యక్రమం చూసి నెక్స్ట్ ఇయర్ కూడా పిల్లలు విజయ్ అన్న వస్తాడు, స్కాలర్ షిప్స్ ఇస్తాడు అనే ఉత్సాహం కలిగించాలనే ప్రయత్నం చేస్తున్నాం. ఈ ఛారిటీ కార్యక్రమం నిజమైన అర్హులకు మాత్రమే వెళ్లేలా చూడాలని నేను విద్యాశాఖ అధికారులను, టీచర్స్ ను రిక్వెస్ట్ చేస్తున్నాం. ఇది మిస్ యూజ్ అయితే నేను చాలా బాధపడతా. నాతో పాటు టీచర్స్ అంతా ఒక మంచి ఆలోచనతో ఈ కార్యక్రమం చేస్తున్నాం. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమవుతోంది. విద్యార్థులందరికీ గుడ్ లక్ చెబుతున్నా. బాగా చదువుకోండి. విజేతలైన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు. అన్నారు.

## 'రిస్క్' మూవీ నుంచి "దేవుడు వరమందిస్తే"సాంగ్

సినిమా ప్రపంచవ్యాప్తంగా జూన్ 26న థియేటర్లలో గ్రాండ్ రిలీజ్

జీకే మిరాకిల్స్ బ్యానర్‌పై ఘంటాడి కృష్ణ దర్శకత్వంలో, సందీప్ అశ్వ హీరోగా తెరకెక్కిన యూత్‌ఫుల్ సస్పెన్స్ థ్రిల్లర్ "రిస్క్" ప్రపంచవ్యాప్తంగా జూన్ 26న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. ఇటీవల విడుదలైన ట్రైలర్, పోస్టర్స్ ప్రేక్షకుల్లో మంచి అంచనాలు క్రియేట్ చేయడంతో పాటు ఇండస్ట్రీ వర్గాల్లో హిట్ టాక్‌ను సొంతం చేసుకుంటున్నాయి. ఈ చిత్రంలోని మెలోడీయస్ సాంగ్ "దేవుడు వరమందిస్తే" ను



బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ త్రినాథ్ రావు నక్కిన లాంచ్ చేశారు. ఇప్పటికే ఈ పాటతో పాటు సినిమాకు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు గంతాడి కృష్ణ, హీరో సందీప్ అశ్వ, నిర్మాతలు రవి సురేష్ రెడ్డి, గుర్రం నర్సిములు, కో-ప్రొడ్యూసర్ గడ్డం రవి కుమార్, కో-డైరెక్టర్ బన్నీ కోయల్ కార్ పాల్గొన్నారు. అలాగే "దేవుడు వరమందిస్తే" పాటకు సంబంధించిన హుక్ స్టెప్‌తో రీల్స్ లేదా డాన్స్ వీడియోలు చేసి సోషల్ మీడియాలో #DevuduVaramandisthe #RISKMovie #SandeepAshwa ట్యాగ్ చేస్తే బెస్ట్ వీడియోలకు చిత్ర యూనిట్ ప్రత్యేక నగదు బహుమతులు అందజేయనున్నట్లు ప్రకటించింది. ప్రేమ, స్నేహం, యూత్ ఎమోషన్స్, సస్పెన్స్ అంశాలతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులను ఖచ్చితంగా అలరిస్తుందని చిత్ర యూనిట్ విశ్వాసం వ్యక్తం చేసింది

## హాలీవుడ్‌లో మైఖేల్ మూవీ చరిత్ర

పాప్ సింగర్ మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన బయోపిక్ 'మైఖేల్' ప్రపంచవ్యాప్తంగా సరికొత్త రికార్డులు సృష్టించింది. ఇప్పటివరకు మ్యూజిక్



బయోపిక్ చిత్రాలలో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా ఉన్న 'బోహేమియన్ రాప్సోడి' రికార్డును ఈ చిత్రం తాజాగా దాటేసింది. హాలీవుడ్ మీడియా కథనాల ప్రకారం, 'మైఖేల్' సినిమా ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 911.9 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 8,673 కోట్లు) భారీ వసూళ్లను రాబట్టింది. దీంతో గతంలో 910.9 మిలియన్ డాలర్ల లైఫ్‌టైమ్ కలెక్షన్లతో అగ్రస్థానంలో ఉన్న 'బోహేమియన్ రాప్సోడి'ని ఇది వెనక్కి నెట్టి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. మరోవైపు 2022లో వచ్చిన ఎల్విస్ ప్రెస్లీ బయోపిక్ 'ఎల్విస్' రికార్డులను కూడా ఈ చిత్రం బద్దలు కొట్టింది. ఈ సినిమాకు ఆంటోయిన్ ఫుక్వా దర్శకత్వం వహించగా.. జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్‌లో నటించాడు. ఈ చిత్రం ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో రెంటల్ విధానంలో స్ట్రీమింగ్ అవుతుంది.

# పెద్ది' బ్రహ్మాండంగా రన్ అవుతోంది

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లేటెస్ట్ సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ 'పెద్ది'. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుని రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లతో సంచలన విజయాన్ని సాధించింది. 2026 సౌత్ ఇండియా నంబర్ వన్ గ్రాసర్ గా నిలిచింది అన్ని ప్రాంతాల్లో హౌస్‌ఫుల్ కలెక్షన్లతో విజయవంతంగా ప్రదర్శితమౌతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం సక్సెస్ ప్రెస్ మీట్‌ను నిర్వహించింది. దర్శకుడు బుచ్చిబాబు సానా, నిర్మాత సతీష్ కిలారు, లిరిక్ రైటర్ అనంత శ్రీరామ్, మైత్రీ శశి ప్రెస్ మీట్ లో పాల్గొన్నారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

**బుచ్చిబాబు గారు.. చరణ్ గారికి 'పెద్ది' వంటి అద్భుతమైన సినిమా ఇచ్చారు. మీ తదుపరి సినిమా కూడా చరణ్ గారితోనే ఉంటుందని వింటున్నాం. అది ఎంతవరకు నిజం?**

–దేనికైనా సమయమే నిర్ణయిస్తుంది. సమయం వచ్చినప్పుడు అది బయటకు వస్తుంది. నేను కూడా అది జరగాలని కోరుకుంటున్నాను.

**అనంత శ్రీరామ్ గారు.. 'పెద్ది'లో అన్ని రకాల పాటలు రాశారు. అయితే ఐటెమ్ సాంగ్‌పై కొన్ని విమర్శలు వస్తున్నాయి. దానిపై మీ స్పందన?**

–ఐటెమ్ సాంగ్‌ను ఐటెమ్ సాంగ్‌లాగే ఆస్వాదించాలి. విమర్శగానీ, ఆరోపణగానీ నిర్దిష్టంగా ఉండాలి. ప్రత్యేకంగా ఎజెండా పెట్టుకుని మాట్లాడితే దానికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. తాత్వికంగా, తార్కికంగా మాట్లాడితే, ఎవరైనా చేసిన విమర్శలకు నేను నిజాయితీగా సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉంటాను.

**బుచ్చిబాబు గారు.. 'పెద్ది' సినిమాలో కొత్త సన్నివేశాలు జోడిస్తున్నారని విన్నాం. ఎప్పటి నుంచి యాడ్ చేస్తారు?**

–ఆల్రెడీ ఎడిట్ చేశాం. ఈ బుధవారం నుంచి యాడ్ అవుతాయి. మొత్తం మూడు సన్నివేశాలు జోడించాం. హీరోయిన్‌కు సంబంధించిన మూడు సీన్లు, అలాగే జగపతిబాబు గారికి ఒక సీన్ ఉంటుంది. మిస్ అయిన అంశాలన్నీ అందులో ఉంటాయి.

–95 శాతం మంది ప్రేక్షకులు సినిమాలోని కంటెంట్, కథ గొప్పతనం, రామ్ చరణ్ గారి నటనను ప్రశంసించారు. ఇలాంటి కథలు మరిన్ని రావాలని కోరుకున్నారు. మేము నమ్మిన దానిని ప్రేక్షకులు నిజం చేశారు. మేము వెళ్లిన ప్రతి థియేటర్‌లో అద్భుతమైన స్పందన లభించింది.

–జాన్వీ పాత్రకు సంబంధించి మరో రెండు సన్నివేశాలు ఉన్నాయి. అవి చూసిన తర్వాత ప్రేక్షకులు ఆ పాత్రకు ఇంకా ఎక్కువగా కనెక్ట్ అవుతారు. బుధవారం నుంచి ఆ సన్నివేశాలు జోడిస్తాం. దాంతో జాన్వీ పాత్ర మరో స్థాయికి చేరుతుందని నమ్ముతున్నాను.

**సతీష్ గారు..టికెట్ రేట్లు తగ్గిస్తే ఫ్యామిలీ ఆడియన్స్ ఇంకా ఎక్కువగా చూస్తారు కదా. ఎప్పటి నుంచి తగ్గిస్తారు?**

–ఈరోజు నుంచే అన్ని రేట్లు తగ్గించాం. స్పందన చాలా బ్రహ్మాండంగా ఉంది. అన్ని ఏరియాల్లో బ్రేక్ ఈవెన్ అయిపోతుంది.

–'పెద్ది' అద్భుతమైన సబ్జెక్ట్. జనాల్లోకి చాలా గ్రాండ్‌గా వెళ్లాలని ఎక్కడా రాజీ పడకుండా ఖర్చు పెట్టాం.

**శశి గారు నైజాంలో సినిమా ఎలా ఉంది?**

–మంచి మోటివేషన్‌తో తీసిన సినిమా. ఈ జనరేషన్‌కు అవసరమైన సినిమా ఇది. ఇలాంటి సినిమా ఇంత కమర్షియల్‌గా రావడం చరిత్రలోనే లేదు. ఇదే మొదటిసారి. ఒక గొప్ప సందేశం ఈ తరం వరకు చేరాలని రామ్ చరణ్ గారు ఈ సినిమా చేశారు. రోజురోజుకీ ప్రేక్షకులు పెరుగుతున్నారు. ఇది ప్రతి ఒక్కరికీ ఒక పరిష్కారం చూపించే సినిమా. ముఖ్యంగా పిల్లలు ఈ సినిమాను బాగా ఎంజాయ్ చేస్తున్నారు.

**బుచ్చిబాబు గారు ఈ సినిమాకు సంబంధించి మీకు వచ్చిన బిగ్గెస్ట్ కాంప్లిమెంట్ ఏది?**

–మొన్న నేను కారులో వెళ్తుంటే ఒక ఆటో డ్రైవర్ తన అమ్మగారితో వచ్చి, "చాలా అద్భుతమైన సినిమా తీశావు బాబు. 25 సంవత్సరాల తర్వాత మళ్లీ థియేటర్‌కు వచ్చాను" అని చెప్పారు. అది నాకు జీవితాంతం గుర్తుండిపోయే కాంప్లిమెంట్.

**రామ్ చరణ్ గారి నటన మరోస్థాయిలో వుంది. దర్శకుడిగా మీరు ఎలాంటి సూచనలు చేశారు?**

–చరణ్ గారు అద్భుతంగా చేశారని ప్రేక్షకులు



అంటున్నారు. ఆయన అంత గొప్పగా నటించడానికి నేను పెద్దగా ఏమీ చేయలేదు. భోజనం చేస్తున్నప్పుడు తర్వాతి సీన్‌లో 'పెద్ది' ఎలా బిహేవ్ చేస్తాడో చెప్పేవాడిని. "మిగతాదంతా నేను చూసుకుంటాను" అని చరణ్ గారు చెప్పేవారు.

–నేను ఊహించిన 'పెద్ది' పాత్రను ఆయన అద్భుతంగా ఆవిష్కరించారు. నటనలో నెక్స్ట్ లెవెల్‌కు వెళ్లిపోయారు. ఈ పాత్రలో ఆయన జీవించారనే మాట కూడా తక్కువే. దానికంటే ఎక్కువగా చేశారు.

–బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ విషయంలో నేను ఎలా అనుకుంటున్నానో ఒక స్కెచ్ వేసి చూపించాను. దాన్ని చూసి షెడ్యూల్స్ ప్లాన్ చేసుకుని అద్భుతంగా ట్రాన్స్‌ఫర్మ్ అయ్యి వచ్చారు. ఆ పాత్రలో పూర్తిగా ఒదిగిపోయారు.

–చిరంజీవి గారు కూడా "చరణ్ అంత కష్టపడ్డాడు కాబట్టే ఇంత పేరు వచ్చింది" అన్నారు. అలాగే చాలామంది "చరణ్ జీవి" అని చెబుతుండటం ఎంతో ఆనందంగా అనిపించింది.

–సురేఖ గారు సినిమా చూసి చాలా ఎమోషనల్ అయ్యారు. "చాలా అద్భుతమైన సినిమా తీశావు" అని ప్రశంసించారు.

–సతీష్ గారు ఈ కథను నమ్మి ఎక్కడా రాజీ పడకుండా అద్భుతమైన నిర్మాణ విలువలతో సినిమా తీశారు. మేము నమ్మిన దానిని ప్రేక్షకులు కూడా నమ్మారు.

### క్లైమాక్స్ గురించి..

–ఈ సినిమా క్లైమాక్స్ నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. కథ వినిపించినప్పుడు చరణ్ గారు కూడా ప్రేక్షకులు ఇప్పుడు ఎలా స్పందిస్తున్నారో అలా స్పందించారు. కథ పూర్తయ్యాక లేచి నన్ను హగ్ చేసుకుని "ఈ సినిమా చేస్తున్నాం" అన్నారు.

–ప్రేక్షకులు ఇలాంటి మంచి మోటివేషన్ వున్న సినిమా ఇంత అద్భుతంగా ఆదరించడం చాలా ఆనందాన్ని ఇచ్చింది.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/26/A2380